


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 211 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం | 11 ఏప్రిల్, 2025 | పేజీలు : 12 | వెల : 2/-




## బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో తిహాడ్‌కు కోర్టుకు రాణా

- ఎన్ఐఏ కోర్టుకు.. అనంతరం తిహాడ్‌కు
- ఎన్ఐఏ ఆఫీసులో విచారించనున్న
- సైకాలజిస్టులతో కూడిన ప్రత్యేక బృందం
- మోదీ ప్రభుత్వ దౌత్యనీతి విజయమిది: షా
- తహవ్వుర్ రాణా కెనడా పౌరుడు
- మాకు సంబంధం లేదు: పాకిస్థాన్

**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :** అమెరికా కోర్టుల్లో న్యాయ పోరాటాలు.. దౌత్యపరమైన ఒత్తిళ్లు.. ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్టుగా జరిగిన 15 ఏళ్లపాటు జరిగిన విచారణలు.. అన్నీ ముగిసి ముంబై మారణహోమం సూత్రధారి తహవ్వుర్ రాణాను భారత్‌కు తీసుకువచ్చే ప్రక్రియ పూర్తయింది. అమెరికాలోని లాస్‌ఏంజిలిస్లో సలో అక్కడి అధికారుల నుంచి రాణాను అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ అధికారులు ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తరలించారు. గురువారం సాయంత్రం ఢిల్లీలోని పాలం ఎయిర్‌వేస్‌లోవిమానం ల్యాండ్ అయింది. అక్కడే రాణాను లాంఛనంగా అరెస్టు చేసిన ఎన్ఐఏ అధికారులు.. వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో పటియాలా హౌస్ ఎన్ఐఏ కోర్టుకు తరలించి న్యాయమూర్తి చందర్‌జిత్ సింగ్ ఎదుట హాజరుపర్చారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు తీహాడ్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా రాణాను తరలించే మార్గాల్లో, కోర్టు పరిసరాల్లో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. రాణా వయసు ప్రస్తుతం 64 ఏళ్లు.

**166 మందిని బలిగొన్న మారణ హోమం :** కసబ్ సహా పది మంది లష్కరే తాయిబా మిగతా 2

### 16న వక్ఫ్ పిటిషన్లపై
## సుప్రీం విచారణ




**న్యూఢిల్లీ, విశ్వంవాయిస్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన వక్ఫ్ చట్టం-2025ను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను ఈనెల 16న విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. పార్లమెంటు ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టం అమలును నిలుపుదల (స్టే) చేయాలంటూ పలు పిటిషన్లు దాఖలు కాగా, వాటిని వెంటనే విచారణకు స్వీకరించేందుకు ఇటీవల సుప్రీంకోర్టు అంగీకరించింది. ఆ ప్రకారమే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మిగతా 2

### పోలీసులపై
## గోరంట్ల దౌర్జన్యం

- వారి అదుపులోని చేబ్రోలు కిరణ్‌పై దాడి యత్నం
- అడ్డుకోబోయిన పోలీసులపైనా వీరంగం
- అరెస్టు చేసిన గుంటూరు పోలీసులు



**గుంటూరు, విశ్వంవాయిస్ న్యూస్** హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ గుంటూరులో పోలీసులపై రెచ్చిపోయారు. మాజీ సీఎం జగన్ సతీమణి భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో పోలీసుల అదుపులో ఉన్న చేబ్రోలు కిరణ్‌పై దాడి చేయడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఇబ్రహీంపట్నం శివారులో కిరణ్‌ను మిగతా 2

### విశాఖ ఉక్కులో
## బలవంతపు రిటైర్‌మెంట్

- మూడు నెలల జీతం ఇచ్చి బయటకు పంపేందుకు యాజమాన్యం సిద్ధం
- గతంలో షోకాజ్ నోటీసులు అందుకున్న వారే టార్గెట్



**విశాఖపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో మొదట స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్ఎస్) ప్రకటించిన యాజమాన్యం ఇప్పుడు 'తప్పనిసరి పదవీ విరమణ పథకం (సీఆర్ఎస్)' అమలుకు రంగం సిద్ధం చేసింది. 15 ఏళ్ల నుంచి పనిచేస్తున్న 1200 మిగతా 2



# పరిశ్రమ ఫలించాలి!

- ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయి?
- ప్రత్యేక పోర్టల్‌లో వివరాలు పొందుపరచాలి
- ఎస్ఐపీబీ భేటీలో చంద్రబాబు ఆదేశం
- ఐటీ కంపెనీలకు నామమాత్రపు ధరలకే భూములు
- 17 పారిశ్రామిక సంస్థలతో ఒప్పందాలు ఖరారు
- వివిధ రంగాల్లో రూ.31,167 కోట్ల పెట్టుబడులు
- 32,633 మందికి ఉద్యోగాల కల్పన

**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :**

'ఒప్పందాలు కుదుర్చుకోవడం... పెట్టుబడులు రావడం మాత్రమే కాదు! పరిశ్రమలు ప్రారంభం కావాలి... ఆ ఫలితాలు క్షేత్రస్థాయిలో కనిపించాలి!' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. అనుకున్న సమయానికి పరిశ్రమలు ఉత్పత్తిని ప్రారంభించడం చాలా అవసరమని తెలిపారు. గురువారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. ఏదైనా ప్రాజెక్టుకు ఆమోదం తెలిపినప్పుడే.. ఆ సంస్థ ఎప్పుడు ఉత్పత్తి ప్రారంభిస్తుందన్న మిగతా 2

### పోలీసులకు
## జగన్ క్షమాపణ చెప్పాలి



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** పోలీసులపై మాజీ సీఎం జగన్ హేయమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆక్షేపించారు. పోలీసు శాఖలో పని చేసే వేలాది మంది మహిళల మనోభావాల్ని కించపరచడమేనని, పోలీసు శాఖకు ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మిగతా 2

### జగన్ నుంచే ప్రజలకు
## భద్రత కావాలి



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** 'నేర స్వభావం ఉన్న వ్యక్తి రాజకీయాల్లో ఉంటే ఎవరికి భద్రత కావాలి? భద్రత కావాల్సింది జగన్‌కు కాదు. జగన్ నుంచి రాష్ట్రానికి.. ప్రజలకు భద్రత కావాలి' అని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. జగన్ భద్రతపై బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై ఆయన గురువారం సచివాయలంలో పైవిధంగా స్పందించారు. సీఎం చంద్రబాబు జెడ్ ప్లస్ కేటగిరీలో ఉన్నా నామమాత్రపు భద్రతతో పర్యటనలకు వెళ్తున్నారని, జగన్‌కు 1100 మంది పోలీసులతో భద్రత కల్పించినా సరిపోలేదనడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ వచ్చిన హెలికాప్టర్ వద్దే 250 మంది పోలీసులు ఉన్నారని, అయినా భద్రత లేదనడం ఏమిటన్నారు.

### భవన నిర్మాణ కార్మికుల అవసరాలకు13 లక్షల మెట్రిక్ టన్నుల
## ఇసుక స్టాక్ యార్డులోనిల్వలు కలెక్టర్




**మలాపురం జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ :** గురువారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లాస్థాయి విశ్వ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ మరియు కమిటీ చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐదు సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచులకు పర్యావరణ అనుమతులు రావడం జరిగిందని త్వరలో ఇసుక తవ్వకాల నిర్వహణ కొరకు టెండర్లు ఖరారు చేస్తూ ఈనెల 30 మిగతా 2



### చంద్రబాబూ చర్యకు
## ప్రతిచర్య తప్పదు

ఉమ్మడి కర్నూలు జిల్లా వైసీపీ నేతలతో జగన్



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** తాము అధికారంలోకి వచ్చాక చంద్రబాబు చేసే చర్యలకు ప్రతి చర్యలు తప్పవని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. తాడేపల్లి ప్యాలెసలో గురువారం ఉమ్మడి కర్నూలు జిల్లా నేతలతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని జగన్ మండిపడ్డారు. ఈ ప్రభుత్వం పోలీసులను వాచ్‌మెన్‌ల కంటే ఘోరంగా వాడుకుంటున్నదని ఆరోపించారు. చంద్రబాబు భయపెట్టే ప్రయత్నాలు చేస్తాడని పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### జగన్ భద్రతపై కేంద్రానికి
## లేఖ రాశాం



**విశాఖపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. గురువారం విశాఖలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రామగిరిలో హత్యకు గురైన వైసీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ వెళితే ప్రభుత్వం కనీస భద్రతా ఏర్పాట్లు మిగతా 2

### ఉద్దేశపూర్వకంగా కోర్టు
## ఉత్తర్వులను అగౌరపర్చారు

- మీ చర్య కోర్టుధిక్కరణ కిందకి వస్తుంది
- సూళ్లూరుపేట సీఐకి నోటీసులు
- పోసానిపై కేసులో తదుపరిచర్యలు నిలుపుదల



**అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ :** సినీనటుడు పోసాని కృష్ణమురళి విషయంలో బీఎన్ఎసఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని తాము ఉత్తర్వులు ఇచ్చిన అనంతరం పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 111 (వ్యవస్థీకృత నేరం), ఇతర సెక్షన్లు చేర్చి విచారణకు పిలవడంపై హైకోర్టు ఆగ్రహం మిగతా 2

(మొదటిపేజీ తరువాయి)

## బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో

ఉగ్రవాదులు 2008 నవంబరు 26న పాకిస్థాన్ నుంచి సముద్ర మార్గంలో ముంబైకి చేరుకుని దారుణ మారణహోమానికి పాల్పడిన విషయం తెలిసిందే. 166 మంది ప్రాణాలను బలిగొన్న ఆ ఉగ్రదాడికి పాల్పడినవారిలో కసబ్ ఒక్కడు ప్రాణాలతో పట్టుబడ్డాడు. దీనిపై దర్యాప్తు చేపట్టిన ఎన్ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ).. అమెరికా జాతీయుడు డేవిడ్ హెడ్లీ, పాకిస్థాన్ సంతతికి చెందిన కెనడా పౌరుడు తహవ్వుర్ రాణా కీలక సూత్రధారులుగా తేల్చింది.

**పాక్‌లో పుట్టి.. కెనడా పౌరుడిగా మారి :** పాకిస్థాన్‌కు చెందిన రాణా.. ఆ దేశ సైన్యంలో వైద్యుడిగా పనిచేశాడు. అప్పుడే పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు ఏర్పడ్డాయి. అదే సమయంలో లష్కరేతాయిబా ఉగ్రవాది, అమెరికన్ పౌరుడు డేవిడ్ హెడ్లీ అలియాస్ దావూద్ గిలానీతో పరిచయం ఏర్పడింది. 1997లో రాణా కెనడాకు వలసవెళ్లాడు. ఇమిగ్రేషన్‌కు సంబంధించి పలు వ్యాపారా లు చేశాడు. 2001లో కెనడా పౌరసత్వం పొందాడు. ఆ తర్వాత అమెరికాలోని చికాగోకు చేరుకుని ఇమిగ్రేషన్ ఏజెన్సీని ఏర్పాటు చేశాడు. నిజానికి లష్కరేతాయిబా సంస్థ ఉగ్రదాడులు, ఉగ్రవాదులు వివిధ దేశాలకు ప్రయాణించేందుకు ఈ సంస్థను అడ్డుపెట్టుకున్నారన్న విషయం తర్వాత బయటపడింది. మరోవైపు డేవిడ్ హెడ్లీ లష్కరేతాయిబాలో భారీ ఉగ్రదాడులపై ప్రత్యేకంగా శిక్షణ పొందాడు. ఆ సమయంలో రాణా, హెడ్లీ తరచూ సంప్రదింపుల్లో ఉండేవారు. ఈ క్రమంలోనే భారత్‌లో భారీ దాడులకు ప్లాన్ వేశారు. రాణా సాయంతో హెడ్లీ ముంబైలో 'ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్' పేరిట ఏజెన్సీని ఏర్పాటు చేశాడు. లష్కరేతాయిబా, ఐఎస్ఐల సూచనల మేరకు.. ముంబైలో తాజ్ హో టల్, ఒబెరాయ్ హోటల్, నారీమన్ పాయింట్ వద్ద రెక్కీ చేసి, మ్యాపులు రూపొందించాడు. అమెరికా మీదుగా పాక్ వెళ్లి వివరాలన్నీ లష్కరేతాయిబా, ఐఎస్ఐ బాసులకు అందజేసి.. ఉగ్రదాడులకు రూపకల్పన చేశారు. ఈ క్రమంలో రాణా, హెడ్లీ 231 సార్లు మాట్లాడుకున్నట్టు ఎన్ఐఏ గుర్తించింది. మరోవైపు రాణా కూడా దాడులకు ముందు సెప్టెంబర్ 13 నుంచి 21 వరకు వైద్యురాలైన తన భార్యతో కలిసి భారత్‌లో పర్యటించాడు. తాజ్‌మహల్ వద్ద, ముంబైలో, కేరళలోని కోచిలో రెక్కీ చేసి వెళ్లాడు. తర్వాత ఐదు రోజులకే ముంబైలో ఉగ్రదాడి జరిగింది. కుంభమేళాలో ఉగ్రదాడికి కూడా రాణా ప్రణాళిక వేసినట్టు గుర్తించారు.

**చట్టపరంగా... దౌత్యపరంగా :** భారత్ చట్టపరంగా, దౌత్యపరంగా చాకచక్యంగా వ్యవహరించడంతోనే రాణా అప్పగింత సాధ్యమైందని నిపుణులు చెబుతున్నారు. ముంబై పేలుళ్లతోపాటు డెన్మార్క్‌లోని ఓ వార్తాపత్రిక కార్యాలయంపై ఉగ్రదాడికి సంబంధించిన కేసులలో 2009లో రాణాను అమెరికా పోలీసులు అరెస్టు చేశా రు. విచారణ జరిపిన అక్కడి కోర్టు ముంబై పేలుళ్ల వ్యవహారంలో నేరుగా సంబంధం లేదని కొట్టివేసింది. కానీ డెన్మార్క్ కేసులో 2013 జనవరిలో అతడికి 14 ఏళ్లు జైలుశిక్ష విధించింది. అప్పటి నుంచి జైల్లో ఉన్న రాణాను ముంబై ఉగ్రదాడి కేసు విచారణ కోసం అప్పగించాలని భారత్ అమెరికాపై ఒత్తిడి తెచ్చింది. దీనిపై అమెరికా కోర్టుల్లో పిటిషన్లు వేసి పోరాడింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రాణా అప్పగింతకు అమెరికా విదేశాంగశాఖ అనుమతి ఇచ్చింది. అప్పగింత నిర్ణయానికి వ్యతిరేకంగా రాణా అమెరికన్ కోర్టుల్లో వరుస గా పిటిషన్లు వేశాడు. పలుమార్లు గుండెపోటు వచ్చిందని, తీవ్రమైన కిడ్నీల వ్యాధి ఉందని.. తాను పాక్ ఆర్మీ మాజీ అధికారి కావడం, ముస్లిం కావడం వల్ల హింసించే అవకాశం ఉందని అతని తరఫు న్యాయవాదులు వాదించారు. భారత్‌కు అప్పగిస్తే తన ప్రాణాలకు ప్రమాదమని పేర్కొన్నారు. ముంబై పేలుళ్ల కేసులో అమెరికా కోర్టు తనను అప్పటికే విచారించిందని, అదే కేసులో భారత్‌కు అప్పగించడం 'డబుల్ జియోపార్డీ (ఒకే కేసులో రెండు సార్లు విచారించడాన్ని నిరోధించే) చట్టం'ను ఉల్లంఘించడమేనని వాదించారు. అయితే ముంబై మారణహోమానికి అతను సూత్రధారి అని, విచారించాల్సి ఉందని భారత న్యాయ నిపుణులు వాదించారు. ఈ కేసులో 'డబుల్ జియోపార్డీ' వర్తించదని అమెరికా కోర్టులకు వివరించి ఒప్పించారు. రాణా భద్రతకు, న్యాయపరమైన హక్కుల కల్పనకు హామీ ఇస్తున్నట్టు వివరించారు. మరోవైపు దౌత్యపరంగానూ అమెరికాపై ఒత్తిడి తెచ్చి రాణా అప్పగింతకు అంగీకరించేలా చే యడంలో భారత్ సఫలమైందని నిపుణులు చెబుతున్నారు.

**అధికారులు, సైకాలజిస్టులతో విచారణ! :** లష్కరేతాయిబా ఉగ్రవాద సంస్థలో కఠిన శిక్షణ పొందిన తహవ్వుర్ రాణా నుంచి సమాచారం రాబట్టడం అంత తేలికకాదని నిఘా వర్గాలు చెబుతున్నాయి. "అమెరికాలో అతడిని ఇప్పటికే తీవ్రస్థాయిలో విచారణ చేశారు. ఎలా తప్పుదోవ పట్టించాలో అతడికి తెలుసు. ఎన్ఐఏ అధికారులతోపాటు నిఘా ఏజెంట్లు, నేర ప్రవర్తన–ఉగ్రవాద నిరోధక అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ పొందిన సైకాలజిస్టులతో కూడిన బృందం రాణాను విచారించి సమాధానాలు రాబడుతుంది. ఇందుకు కొంత ఎక్కువ సమయమే పట్టొచ్చు.." అని పేర్కొంటున్నాయి. కాగా ఢిల్లీలోని ఎన్ఐఏ ప్రధాన కార్యాలయంలో ఉన్న ప్రత్యేకమైన సెల్‌లో రాణాను విచారిస్తారని నిఘా వర్గాలు తెలిపాయి. ఎన్ఐఏ డీజీ సదానంద్ దతే, ఐజీ అశీశ్ బాత్రా, డీఐజీ జయరాయ్ సహా 12 మంది అధికారులకు మాత్రమే అందులోకి ప్రవేశించే అనుమతి ఉంటుందని వెల్లడించాయి.

**నాటి దాడిలో గాయపడి.. నేడు ఎన్ఐఏ చీఫ్‌గా :** ప్రస్తుతం ఎన్ఐఏ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న సదానంద్ దాతే.. నాడు ముంబై ఉగ్రదాడిలో ప్రాణాలకు తెగించి పోరాడటం విశేషం. అప్పట్లో ముంబై అదనపు పోలీస్ కమిషనర్‌గా ఉన్న సదానంద్ దాతే.. ఉగ్రవాద దాడుల విషయం తెలిసి స్వయంగా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో ఉగ్రవాది కసబ్ విసిరిన గ్రనేడ్ పేలి తీవ్రంగా గాయపడ్డారు. నాడు చూపిన తెగువకు రాష్ట్రపతి పోలీస్ మెడల్ కూడా అందుకున్నారు.

**రాణాతో మాకు సంబంధం లేదు: పాకిస్థాన్ :** ఉగ్రవాది రాణా విషయంలో పాకిస్థాన్ కప్పగంతులు వేస్తోంది. అమెరికా రాణాను భారత్‌కు అప్పగించిన నేపథ్యంలో పాక్ విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. రాణా ప్రస్తుతం తమ దేశ పౌరుడు కాదని, గత 20 ఏళ్లలో ఎప్పుడూ అతను పాకిస్థాన్‌కు చెందిన ఎలాంటి ధ్రువపత్రాలను పునరుద్ధరించుకోలేదని తెలిపింది. రాణా కెనడా పౌరుడని పేర్కొంది. అయితే రాణాకు పాక్ సైన్యం, ఐఎస్ఐలోని కీలక వ్యక్తులతో సంబంధాలున్నాయని.. ఎన్ఐఏ విచారణ లో కీలకఅంశాలు, రహస్యాలను బయటపెట్టవచ్చనే ఆందోళన పాక్‌లో వ్యక్తమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు.

**హెడ్లీని మాత్రం రప్పించలేం! :** ముంబై ఉగ్రదాడి సూత్రధారుల్లో ఒకరైన డేవిడ్ హెడ్లీని మాత్రం భారత్‌కు రప్పించలేమని నిఘా వర్గాలు చెబుతున్నాయి. హెడ్లీ అమెరికా పౌరుడు కావడం, అమెరికా దర్యాప్తు సంస్థలకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించడంతోపాటు 2010లో అమెరికా దర్యాప్తు అధికారులతో కుదుర్చుకున్న ఒప్పందం దీనికి కారణమని వివరిస్తున్నాయి. "ఉగ్రవాద కేసుల్లో అరెస్టైన హెడ్లీ.. 2010లో అమెరికా అధికారులతో చట్టపరమైన ఒప్పందం కుదుర్చుకున్నాడు. ముంబై దాడులు, లష్కరేతాయిబాతో, పాక్ ఐఎస్ఐతో సంబంధాలు, కార్యకలాపాల సమాచారమంతా వెల్లడించాడు. బదులుగా తనను భారత్, పాకిస్థాన్, డెన్మార్క్ దేశాలకు అప్పగించవద్దని ఒప్పందం చేసుకున్నాడు.." అని నిఘా వర్గాలు తెలిపాయి. అంతేగాకుండా అమెరికా నిఘా, దర్యాప్తు సంస్థలకు హెడ్లీ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించిన నేపథ్యంలో.. సంబంధిత కీలక సమాచారం బయటపడకుండా ఉండేందుకు కూడా అతడిని ఇతర దేశాలకు అప్పగించే అవకాశం లేదని వెల్లడించాయి.

**మోదీ ప్రభుత్వ దౌత్యనీతి విజయమిది: అమిత్ షా :** ఉగ్రవాది తహవ్వుర్ రాణాను భారత్‌కు తీసుకురావడం మోదీ ప్రభుత్వ దౌత్యనీతి విజయమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభివర్ణించారు. గతంలోని యూపీఏ ప్రభుత్వం ఈ పనిచేయలేకపోయిందని పరోక్షంగా విమర్శించారు. "మన గడ్డమీద, మన ప్రజల మీద దాడి చేసినవారిని రప్పించి శిక్షించడం భారత ప్రభుత్వ విధి. కానీ ముంబై ఉగ్రదాడి జరిగినప్పుడున్న ప్రభుత్వం రాణాను రప్పించలేకపోయింది. ఇప్పుడు మోదీ ప్రభుత్వ దౌత్యనీతితో విజయం సాధించింది" అని అమిత్ షా కార్యాలయం ప్రకటించింది. ఇక కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలతో ఉగ్రవాదం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. మోదీ ప్రభుత్వం రాణాను రప్పించి నాటి మృతుల కుటుంబాలకు న్యాయం చేసిందని పేర్కొన్నారు.

**మేం మొదలుపెట్టిందే పూర్తిచేశారు: చిదంబరం** : రాణా అప్పగింత విషయంలో మోదీ ప్రభుత్వం చేసినదేమీ లేదని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. "రాణా అప్పగింతను మోదీ ప్రభుత్వం తమ గొప్పగా చెప్పుకునేందుకు ఆరాటపడుతోంది. కానీ రాణాను రప్పించేందుకు యూపీఏ ప్రభుత్వమే ప్రక్రియ మొదలుపెట్టింది. ఒకటిన్నర దశాబ్దాల పాటు చట్ట, దౌత్య, నిఘా పరమైన పోరాటంతోనే ఇది సాధ్యమైంది" అని పేర్కొన్నారు.

## సుప్రీం విచారణ

సంజీవ్ ఖన్నా నేతృత్వంలో త్రిసభ్య బెంచ్‌ను ఏర్పాటుచేశారు. ఈ బెంచ్‌లో జస్టిస్ సంజ య్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ సభ్యులుగా ఉన్నారు. కాగా వక్ఫ్ సవరణ చట్టానికి అనుకూలంగా హిందూసేన అధ్యక్షుడు పిటిషన్ దాఖలుచేశారు. నూతన చట్టాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై నిర్ణయం తీసుకునే ముందు తమ వాదననూ ఆలకించాలంటూ కేంద్రప్రభుత్వం తాజాగా కేవియట్ పిటిషన్ దాఖలుచేసింది. మరోవైపు, నూతన వక్ఫ్ చట్టంపై అవగాహన కల్పిస్తూ దేశవ్యాప్త ప్రచారానికి బీజేపీ సిద్ధమవుతోంది. ఈ నెల 20 నుంచి మొదలయ్యే ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు ప్రధానంగా ముస్లింలను కలిసి తాజా చట్టం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తారు.

**మతమార్పిడి చట్టాలపై 16న సుప్రీంలో విచారణ :** మతమార్పిడి సమస్యపై దాఖలైన పలు వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు ఈ నెల 16న విచారణ జరపనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టనుంది. బలవంతపు మతమార్పిడికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కొన్ని పిటిషన్లు, మతాంతర వివాహాలు చేసుకున్నవారికి రక్షణ కల్పించాలని కోరుతూ మరికొన్ని వ్యాజ్యాలు దాఖలయ్యాయి. భయపెట్టడం, ఆర్థికంగా ప్రలోభపెట్టడం వంటి మోసపూరిత చర్యల ద్వారా జరిగే మతమార్పిడిలను అరికట్టాలని పిటిషనర్లు కోరారు.

## పరిశ్రమ ఫలించాలి!

తేదీపై స్పష్టత తీసుకోవాలని సీఎం చెప్పారు. దానికి అనుగుణంగా దశలవారీగా ప్రాజెక్టు పురోగతిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకూ ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్న ఎన్ని సంస్థలు ఉత్పత్తి ప్రారంభించాయి.. ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయనే వివరాలతో ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించాలని చంద్రబాబు ఆదేశించారు. ఏ సంస్థ ఎవరెవరికి ఉద్యోగాలు ఇచ్చిందో వ్యక్తిగత వివరాలు కూడా సదరు పోర్టల్‌లో ఉంచాలన్నారు. ఐటీ కంపెనీలకు నామమాత్రపు ధరలకే భూ కేటాయింపులు జరపాలని మంత్రి లోకేశ్ కోరగా.. సీఎం ఆమోదం తెలిపారు. సవరించిన భూమి ధరలతో పాలసీని తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో 17 పారిశ్రామిక సంస్థలతో ఒప్పందాలను ఖరారు చేశారు. మౌలిక సదుపాయాలు, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, ఎనర్జీ తదితర రంగాల్లో రూ.31,167 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలను ఆమోదించారు. ఆయా కంపెనీల ద్వారా 32,633 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

**10 నెలలు.. రూ.4,71,379 కోట్ల పెట్టుబడులు :** టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటిదాకా ఐదు ఎస్ఐపీబీ సమావేశాలు జరిగాయి. వీటిలో 57 సంస్థలకు సంబంధించి రూ.4.17.379 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. 4,17,188 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఐదు ఎస్ఐపీబీ సమావేశాలను నిర్వహించగా.. కూటమి వచ్చిన పది నెలల్లోనే ఐదు జరిపామని చంద్రబాబు వెల్లడించారు. సమావేశంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఇంధనమంత్రి గొట్టిపాటి రవికుమార్, మౌలిక సదుపాయాల కల్పన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి . ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులతో వస్తున్న 17 కంపెనీలివే..

కంపెనీ పెట్టుబడి ఉద్యోగాలు వివరణ (రూ.కోట్లలో)

మాయా మహామాయ 2063 1000 స్టీల్ ఉత్పత్తి విస్తరణ.. 131 ఎకరాల

ఇండస్ట్రీస్, విజయనగరం భూమితోపాటు ఇతర ప్రోత్సాహకాలు

ప్రీమియర్ ఇంజనీర్స్ 4200 1500 సోలార్ సెల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ లిమిటెడ్.., నాయుడుపేట

ఎల్జీ వెండార్స్, శ్రీసిటీ 839 692 వైట్ గూడ్స్ మాన్యుఫాక్చరింగ్ ప్రొటెన్షియల్ లిమిటెడ్,

శ్రీసిటీ 1055 515 అమోర్ఫాస్ మెటల్ తయారీ

శ్రేష్ఠ ఫార్మ్స్ 459 559 పౌల్ట్రీఫీడ్

పెట్రా సిలికాన్ లిమిటెడ్ 585 477 సిలికా తయారీకి అనువైన 224 ఎకరాల భూమి

డిక్సన్ టెక్నాలజీస్ కొప్పర్తి ఈఎంసీ తరహా ఈఓటీ ఫీజు

ఏవీశా ఫుడ్స్ 500 500 వ్యవసాయ క్షేత్రం కోసం రాయితీ

ధరపై 115 ఎకరాల భూమి

రాంకో సిమెంట్స్ 478 550 ఏటా 6.3 టన్నుల ఉత్పత్తి.. 79.91 ఎకరాలు

ఎంఎండబ్ల్యూఎల్ 1198 870 మడకశిరలో 325 ఎకరాలు

టాప్‌లైన్ మెటల్ అండ్ 32 200 ఈవోటీ రద్దు..

10.75 ఎల్లాయ్ ఇండియా ఎకరాలు కేటాయింపు

టాటా కన్సల్టెన్సీ 1370 12000 21.16 ఎకరాల్లో ఐటీ కాంప్లెక్స్ నిర్మాణం

అల్ట్రాక్లస్టర్స్ 5278 2500 విశాఖలో 59 ఎకరాల్లో డేటా సెంటర్/ ఐటీ ఆఫీస్

జేఎస్‌డబ్ల్యూ నియో 660 110 88 మెగావాట్ల విండ్ పవర్ ఎనర్జీ, కర్నూలు

రెన్యూ విక్రమ్ శక్తి, అనంతపురం 3000 1050 540 మెగావాట్ల సోలార్ ప్లాంట్

చింతా గ్రీన్ ఎనర్జీ, సత్యసాయి జిల్లా 2450 2400 బ్యాటరీ స్టోరేజీతో 700 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్

చింతా గ్రీన్ ఎనర్జీ 7000 6900 బ్యాటరీ స్టోరేజీతో 2,000 మెగావాట్ల

సౌరవిద్యుదుత్పత్తి

## పోలీసులపై గోరంట్ల దౌర్జన్యం

అరెస్టుచేసి తీసుకొస్తున్న పోలీసులను గుంటూరు ఎస్పీ కార్యాలయం సమీపంలో అడ్డగించబోయారు. ఈ సందర్భంగా గుంటూరు ఎస్పీ కార్యాలయం వద్ద మాధవ్ హల్‌చల్ సృష్టించారు. ఎట్టకేలకు మాధవ్ సహా నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిజానికి, చేబ్రోలు కిరణ్ సోషల్ మీడియాలో చేసిన అనుచిత వ్యాఖ్యలపై టీడీపీ వెనువెంటనే స్పందించి ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. పోలీసులు వేగంగా రంగంలోకి దిగి కిరణ్‌ను అరెస్టు చేశారు. వాస్తవం ఇది కాగా, కిరణ్‌ను అరెస్టు చేసిన పోలీసుల విధులకు మాజీ ఎంపీ మాధవ్ అడ్డుతగలడమే కాకుండా, వారిపైనా దౌర్జన్యానికి పాల్పడ్డారు. అంతకుముందు, తన అనుచరులతో కారులో పోలీసుల వాహనాన్ని వెంబడించారు. పోలీసుల అదుపులో ఉన్న కిరణ్‌పై దాడికి ప్రయత్నించారు. ప్రతిఘటించిన పోలీసులపైనా విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో పోలీసుల వాహనం ఎస్పీ కార్యాలయంలోకి వెళ్లింది. అయినా, వదలకుండా ఆ వాహనాన్ని మాధవ్ వెంబడించారు. ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలోనూ కిరణ్‌పై దాడికి మరోసారి ప్రయత్నించారు. గోరంట్ల మాధవ్‌తో పాటు ఆయన అనుచరులు ముగ్గురిని పోలీసులు ఎట్టకేలకు అదుపులోకి తీసుకొన్నారు. వైసీపీతో సన్నిహిత సంబంధాలు ఉన్న పోలీస్ అధికారే లీక్ చేసి ఉంటారనే ప్రచారం జరుగుతుంది. గురువారం విజయవాడలో మీడియా సమావేశంలో పాల్గొన్న గోరంట్ల మాధవ్ ఆ తరువాత నేరుగా కిరణ్‌ను తరలిస్తున్న పోలీసు వాహనాన్ని గుర్తించి వెంబడించడం అనుమానాలకు తావిస్తోంది. మాధవ్ హడావుడి అంతా వైసీపీ మైండ్ గేమ్‌లో భాగమని పోలీస్ వర్గాలు అంటున్నాయి. మాజీ ఎంపీ గోరంట్ల మాదవ్ ను కలవడానికి మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి నగరంపాలెం స్టేషన్‌కు వెళ్లారు. అప్పటికే ఆయనను పోలీసులు నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో కొద్దిసేపు ఎదురు చూసి తిరిగి వెళ్లిపోయారు.

## విశాఖ ఉక్కులో బలవంతపు రిటైర్‌మెంట్

మందికి ఇటీవల వీఆర్ఎస్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఉద్యోగుల సంఖ్య ఇంకా తగ్గించాలని ఉక్కు మంత్రిత్వ శాఖ ఆదేశించడంతో ఇప్పుడు సీఆర్ఎసకు పదును పెట్టారు. తొలుత దీనిని ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులతో ప్రారంభిస్తున్నారు. ఆ తరువాత నాన్ ఎగ్జిక్యూటివ్‌లకు వర్తింపజేస్తారంటున్నారు. రెండేళ్ల సర్వీసు ఉన్న వారిని దీనికి ఎంపిక చేసుకున్నారు. గతంలో ఏ కారణాల వల్లనైనా రెండు షోకాజ్ నోటీసులు అందుకొని ఉంటే...వాటికి ఇప్పుడు సంజాయిషీ కోరుతున్నారు. ఆయా కారణాల వల్ల ఎందుకు సీఆర్ఎసపై మిమ్మల్ని తొలగించకూడదో చెప్పాలని కోరుతూ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. యాజమాన్యం తమ చర్యలను ప్రశ్నించేవారు ఎవరైనా ఉంటే వారిని ఏదో విధంగా బయటకు పంపాలని ఇలాంటి ఎత్తుగడలు వేస్తోందని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ విధంగా సుమారు 100 మందికి సీఆర్ఎస్ ఇవ్వాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ విధంగా వెళ్లిపోయే వారికి కేవలం మూడు నెలల జీతం మాత్రమే ఇస్తారు. ఎటువంటి నష్ట పరిహారాలు రావు. గ్రాట్యుటీ, పీఎఫ్ వంటివి అందరితో పాటు వస్తాయి.

**రెండో వీఆర్ఎస్‌కు సిద్ధం చేయడమే లక్ష్యం :** ప్లాంటులో రెండో విడత వీఆర్ఎస్ ప్రకటన ఇవ్వడానికి కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొదటి విడతలో చాలామంది ఆసక్తి చూపకపోవడంతో యాజమాన్యం లక్ష్యం నెరవేరలేదు. దానిని పూర్తి చేయడానికి రెండో విడత వీఆర్ఎసకు ముందు సీఆర్ఎస్ నోటీసులతో ఉద్యోగులను భయపెడుతున్నారు. మూడు నెలల జీతంతో షోకాజ్‌లు అందుకొని వెళ్లడం కంటే గౌరవంగా వీఆర్ఎసతో అన్ని రకాల ప్రయోజనాలు తీసుకోవడమే మంచిదనే నిర్ణయానికి ఉద్యోగులు వచ్చేలా ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ విషయాలను స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళితే.. ప్లాంటుకు సంబంధించిన ప్రతి అంశంపైనా తాము స్పందించడం సరికాదనే మాటలు వినిపిస్తున్నాయి.

## పోలీసులకు జగన్ క్షమాపణ చెప్పాలి

మేడికొండూరు మండలం పాలడుగులో గురువారం 'పల్లెకు పోదాం చలో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలతో కలసి ఆరోగ్యకేంద్రం, సచివాలయాలు, ఆలయాలను పురందేశ్వరి సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ విద్వేషం, విధ్వంసం మినహా రాష్ట్ర అభివృద్ధికి జగన్ చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రస్తుతం డబుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి పరుగులు పెడుతోందని చెప్పారు. తాజాగా కేంద్రం అమరావతికి రూ.4,285 కోట్లు ఇవ్వడంతోపాటు తిరుపతి–కాట్పాడి రైల్వేలైన్ అభివృద్ధికి 1331 కోట్లు మంజూరు చేసిందన్నారు. రొయ్యలు, చేపల ఎగుమతులకు సంబంధించి అమెరికాతో ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంప్రదింపులు జరపడంతో సుంకాల పెంపు 90రోజులు వాయిదా పడిందన్నారు.

## జగన్ భద్రతపై కేంద్రానికి లేఖ రాశాం

చేయలేదన్నారు. జగన్ భద్రతపై తమకు ఆందోళనగా ఉందని, ఈ విషయమై కేంద్రానికి లేఖ రాశామని, స్వయంగా ప్రధానిని కలిసి వివరిస్తామన్నారు. రాజకీయ నేతలపై మాట్లాడడం పోలీసులకు ఫ్యాషన్ అయిపోయిందన్నారు.

## ఉత్తర్వులను అగౌరపర్చారు

వ్యక్తం చేసింది. ఇలాంటి చర్యలు కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా అగౌరవపర్చడమేనని వ్యాఖ్యానించింది. కేసు దర్యాప్తు చేస్తున్న సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్ సీఐ చర్యలు కోర్టుధిక్కరణ కిందికి వస్తాయని పేర్కొంది. దర్యాప్తు అధికారి చర్యలు కోర్టు అధికారాన్ని, రూల్ ఆఫ్ లాను అధిగమించడమేనని తెలిపింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు ఇచ్చినప్పుడు అనుసరించాల్సిన విధివిధానాలపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, తమ ఉత్తర్వులను పక్కనపెట్టి దర్యాప్తు అధికారి దురుద్దేశపూర్వకంగా వ్యవహరించారని పేర్కొంది. కోర్టు ధిక్కరణ కింద చర్యలు ఎందుకు ప్రారంభించకూడదో తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని దర్యాప్తు అధికారి సీఐ మురళీకృష్ణకు ఫామ్–1 నోటీసులు జారీ చేసింది. విచారణను ఏప్రిల్ 25కి వాయిదా వేసింది. పోసానిపై సూళ్లూరుపేట పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడుని పోసాని అసభ్యపదజాలంతో దూషించారన్న ఫిర్యాదు ఆధారంగా గతేడాది నవంబర్ 14న సూళ్లూరుపేట పోలీసస్టేషన్‌లో కేసు నమోదైంది. వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది పాపుడిప్పు శశిధర్ వాదనలు వినిపించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తూ.. పోలీసులకు ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. దర్యాప్తు అధికారి తీరును తీవ్రంగా తప్పుపట్టారు.

## ఇసుక స్టాక్ యార్డులోనిల్వలు కలెక్టర్

నాటికి ఇసుక తవ్వకాలు ప్రారంభించి స్టాక్ యార్డులకు ఇసుకను తరలించి నిల్వలు చేయడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్ లు ఆపరేషన్ కొరకు కనీసం ఐదు ప్రక్క జిల్లాల విధి విధానాలపై అధ్యయనం చేస్తూ ఈనెల 16 నాటికి కార్యాచరణ సిద్ధపరచాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వారికి సూచించారు. ప్రస్తుతం పనిచేస్తున్న టాస్క్ ఫోర్స్ టీమ్ లను బలోపేతం చేస్తూ అక్రమ ఇసుక త్రవ్వకాలు రవాణాను నిరోధించాలన్నారు. అదేవిధంగా సెమీ మెకనైజ్డ్ రీచ్ లు కమిటీలో సభ్యులుగా ఉన్న డ్వామా పిడి, ఆర్ అండ్ బి స్. ఎస్.ఇ, జల వనరుల శాఖ ఇంజనీర్, జిల్లా రిజిస్ట్రర్, జిల్లా ఆడిటర్లు సెమీ మె కనైజ్డ్ రీచ్ లు ఆపరేషన్స్ పై విధివిధానాలపై నిష్పక్షపాతంగా విధానాలు ఉండేటట్లు రూపొందించాలన్నారు. ఈనెల 17న టెండర్లు పిలిచి ఈ నెల 22వ తేదీన ఫైనలైజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 16వ తేదీన సెమీ మె కనైజ్డ్ రీచుల కార్యకలాపాలపై మరొకసారి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి నిర్దిష్టమైన విధివిధానాలను కమిటీ సభ్యులు అనుమతితో ఖరారు చేయడం జరుగుతుందన్నారు. ఈ ఐదు సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచులలో సుమారు 21 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. కొత్తపేట, రావులపాలెం, కపిలేశ్వరపురం, అమలాపురంలో స్టాక్ యార్డు లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత ఏడాది కేవలం వర్షాకాలం సీజన్లో 6.25 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వలు చేయడం జరిగిందని విస్తరిస్తున్న భవన నిర్మాణ రంగాన్ని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని దీనిని రెట్టింపు చేస్తూ 13 నుండి14 లక్షల మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వలు ఉండే విధంగా కార్యాచరణ సిద్ధం చేయడం జరిగిందన్నారు. రావులపాలెం జాతీయ రహదారి–16 కు దగ్గరగా 8 లక్షలు, అమలాపురం స్టాక్ యార్డ్ లో 3 లక్షలు, తూర్పు డెల్టా గౌతమి ప్రాంతంలో 3 లక్షలు మెట్రిక్ టన్నులు నిల్వలు చేయనున్నట్లు తెలిపారు. ఈ స్టాక్ యార్డుకు సంబంధించి యాక్సిస్ బులిటి రోడ్లు, పార్కింగ్ సౌకర్యాలపై వేయింగ్ బ్రిడ్జిలు వంటి వసతులపై అధ్యయనం చేయాలని ఆర్డీవోలను ఆదేశించారు. సెమీ మెకనైజ్డ్ రీచుల నిర్వహణ ఏజెన్సీలకు స్టాక్ యార్డ్ లలో ఇసుక తరలింపు కూడా అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉచిత ఇసుక పాలసీలో ఉన్న విధివిధానాల ప్రకారం స్టాక్ యార్డ్ లను బలోపేతం చేయాలని ఆదేశించారు. ప్రతిరోజు సుమారు 15 వేల మెట్రిక్ టన్నులు ఇసుక తవ్వకాలు నిర్వహించి స్టాక్ యార్డుకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం ఇసుక త్రవ్వకాలకు సంబంధించి మే, జూన్ మాసాలు మాత్రమే అనువుగా ఉంటాయన్నారు. స్టాక్ యార్డులు మరియు సెమీ మెకనైజ్డ్ రీచ్ లు మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఐదు సెమీ మెకనైజ్డ్ రీచులలో ఇసుక త్రవ్వకాలు పూర్తి స్థాయిలో చేపట్టిన అనంతరం ఒక సినీ మెకనైజ్డ్ రీచ్ ను కాకినాడ జిల్లా భవన నిర్మాణ అవసరాలకు కేటాయించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం స్టాక్ యార్డు లలో కేవలం 1,92,000 మెట్రిక్ టన్నులు మాత్రమే నిల్వలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. కొన్ని మ్యానువల్ రీచ్ ల నుండి కూడా ఇసుకను స్టాక్ యార్డుకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డి పట్టా భూములలో ఇసుక తవ్వకాలు నిర్వహణకు సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు రావాల్సి ఉందని, ఇవి వచ్చిన పిదప సంబంధిత భూ యజమాన్యాలు రోజు వారీగా సుమారు 500 మెట్రిక్ టన్నుల ఇసుక త్రవ్వకాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉంటే వారికే ఇవ్వాలని లేని పక్షంలో మాన్యువల్ మాదిరిగా టెండర్లు పిలవాలని కమిటీ సభ్యులకు సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు గుర్తించిన డి పట్టా భూములలో సుమారు 99,300 మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వలు ఉన్నాయన్నారు. స్టాక్ యార్డులలో ఇసుక నిలువలను వినియోగదారులకు సరఫరా చేసేందుకై ముందుగా అమలాపురం స్టాక్ యార్డ్ కు చార్జీలు నిర్ణయించాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. డి పట్టా భూములలో ఇసుకను తరలించే మార్గాలలో బలహీనమైన వంతెనలు ఉన్నట్లయితే ఓవర్ లోడ్ తో వాహనాలు రాకపోకలు సాగించకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. ముఖ్యంగా అమలాపురం చుట్టుపక్కల బలహీన వంతెనలు గుర్తించి నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ఉచిత ఇసుక పాలసీ నిబంధనలకు అనుగుణంగా ఇసుక తరలించే వాహనాలు ఇసుకపై తప్పనిసరిగా తార్పాలిన్ కప్పి తరలించాలని ఆదేశించారు. అదేవిధంగా ఓవర్ లోడ్ విషయంలో రవాణా అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. బల్క్ వినియోగదారులు సాధారణ వినియోగదారుల కోపంలో జనరేషన్ విధివిధానాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, ఆర్డీవోలు పి శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, భూగర్భ గనుల శాఖ ఏడి ఎల్ వంశీధర్ రెడ్డి, గోదావరి హెడ్ వర్క్స్ ఈ ఈ కాశీ విశ్వేశ్వరరావు, ఆర్టీవో డి.శ్రీనివాసరావు, ఆర్డబ్ల్యూ ఎస్ డిఈ పద్మనాభం, జి ఎస్ డబ్ల్యూ ఎస్ కోఆర్డి నేటర్ సువిజయ్, ఆర్ అండ్ బి ,ఎస్ ఇ బి.రాము, తదితరులు పాల్గొన్నారు.

# 12న కైలాస భూమి ప్రారంభోత్సవం చేయనున్న స్థానిక ఎమ్మెల్యే



**కొత్తపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** కొత్తపేట లైన్స్ క్లబ్ కైలాస భూమి చైర్మన్ నంబూరి రెడ్డియ్య టిడిపి మండల శాఖ అధ్యక్షుడు కంఠం శెట్టి శ్రీనివాసరావు ప్రభుత్వ గ్రాంట్లు దాతల సహకారం లైన్స్ క్లబ్ సహకారం తో రూపుదిద్దుకున్న కైలాస భూమి ఈనెల 12వ తేదీన స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం కానుంది ఎంపీ గంటి హరీష్ మాధుర్ తదితర ప్రజాప్రతినిధులు ఈ ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారు ఈ ప్రారంభోత్సవానికి నియోజకవర్గ నాయకులు అలాగే ప్రజలు గ్రామస్తులు అందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నట్లు నంబూరి రెడ్డియ్య కంఠం శెట్టి శ్రీనివాసరావు లు తెలిపారు.

# ఎంపిడిఓ కృష్ణ మోహన్‌ను అభినందించిన సర్పంచ్



**అల్లవరం విశ్వంవాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం వర్క్ ఫ్రం హెూం సర్వే లో జిల్లాలో 100 శాతం సాధించిన మండలం గా నిలిచిన సందర్భంగా ఎంపిడిఓ బి కృష్ణ మోహన్ ను బోడసకుర్రు సచివాలయంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. మండలాన్ని అన్ని సర్వేలు, కార్య క్రమాలలో ముందు వరుసలో ఉంచుతున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వర రావు ,రొక్కాల నాగేశ్వర రావు కార్యదర్శి బి ఆది శంకరం సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.





## ప్రకృతి వ్యవసాయంతో

# భూసారం పెరుగుతుంది

**వ్యవసాయ శాఖ,ప్రకృతి వ్యవసాయ విభాగం సంయుక్తంగా విత్తనాల కిట్ల పంపిణీ**

**ప్రతీ రైతు కనీసం 50 సెంట్లు ప్రకృతి వ్యవసాయం చేయాలి**

## మండల వ్యవసాయ అధికారికే ప్రభాకర్






**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాయవరం మండలం కూర్మాపురం లో గ్రామ రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ శాఖ,ప్రకృతి వ్యవసాయ విభాగం సంయుక్తంగా పి.ఎం.డి.ఎస్ (13 రకాల విత్తనాలను) కిట్లను రైతుల సమక్షంలో పంపిణీ చేయడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి కే ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం పై రైతులకు అవగాహన కల్పించి ప్రతి రైతు కనీసం 50 సెంట్లు ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టే విధంగా ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బందిని ఆదేశించడం జరిగింది. దీనివలన మనం తినే ఆహారంలో రసాయనిక అవశేషాలు తగ్గడం వలన మానవుల ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడతాయని తదనుగుణంగా రెండవ పంట కోత కోయడానికి వారం రోజులు ముందుగా పి.ఎం.డి.ఎస్ కిట్లు(పిల్లి పెసర,మినుములు, పెసలు, తెల్ల జొన్నలు, మొక్కజొన్నలు, జీలుగా, గంట్లు, జనములు, ఉలవలు, బొబ్బర్లు, పొట్టి శనగలు, ధనియాలు, గోంగూర) ఎకరానికి 10 కేజీల చొప్పున చల్లుకున్నట్లయితే వేసవిలో పంట భూమి ఖాళీగా ఉండకుండా అధిక ఉష్ణోగ్రత కారణంగా భూమిలో ఉండే సారవంతమైన సేంద్రియ పదార్థం మరియు రైతుకు ఉపయోగపడే శిలీంద్రాలు బ్యాక్టీరియా చనిపోకుండా బలపరుస్తుందని దీనిని కాపాడుకోవడానికి పీ.ఎం.డీ.ఎస్ విత్తనాలను చల్లడం ద్వారా వేసవి అంతా పచ్చని పంటతో కప్పి ఉంచబడి, ఉష్ణోగ్రత నుండి సూక్ష్మజీవులను, బ్యాక్టీరియాను కాపాడుకోవడమే కాకుండా వచ్చే తొలకరి కి దీనిని కలియ దున్నడం వలన భూమికి అధిక సారం అందుతుందని, అంతేకాకుండా నీరు నిల్వ సామర్థ్యం మెరుగుపడుతుందని, ముఖ్యంగా రసాయనిక ఎరువులు వినియోగం తగ్గి రైతుకు నికర ఆదాయం పెరుగుతుందని తెలిపారు. అదేవిధంగా సేంద్రీయ గర్భం పెరగడమే కాకుండా పాడి పశువులకు పౌష్టికాహారం అందించే మేతగా కూడా ఉపయోగపడుతుందని తెలియపరిచారు రైతులంతా పీఎండీఎస్ విత్తనాలను తమ యొక్క పొలాలలో చల్లుకుని పంట పొలాలను సారవంతం చేయాలని సూచించారు ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ఏ బాబు రావు మాట్లాడుతూ ఈ ప్రకృతి వ్యవసాయాన్ని రైతులంతా అలవాటు పరుచుకోవాలని దీనివలన రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గి,నికర లాభం పెరుగుతుందని, ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు నుండి సారవంతమైన భూమిని కాపాడుకోవడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం డైరెక్టర్ కోరిపల్లి శ్రీనివాసరావు , గ్రామ నాయకులు ముత్యాల చంద్రశేఖర్ జానకి రామయ్య . ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## కాలినడక ద్వారా వాడపల్లి వెంకన్న దగ్గరకు

# కేశవ స్వామి మాలదారులు 150 మంది భక్తులు





**కొత్తపేట ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి వారి దేవస్థానంనందు జగన్మోహిని కేశవ స్వామి వారి దివ్య కళ్యాణ మహెూత్సవము లో బాగంగా ఈరోజు అర్చన, అమ్మవార్లకు కుంకుమార్చన ఉదయం మరియు సాయంత్రం నిత్య ఉపాసన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పములు మరియు సాయంత్రం సదస్యం (మహాదాశీర్వచనం) అనంతరం శ్రీ సత్య శ్రావణి నృత్యానికేతన్,రాజమహేంద్రవరం వారిచే భరతనాట్య ప్రదర్శన అత్యంత వైభవంగా జరిగింది 12 న చక్రస్థానం. 13 వ తేది న పుష్పోత్సవం అత్యంత వైభవంగా జరుగుతాయని తెలియజేశారు ర్యాలీ జగన్మోహిని కేశవ స్వామి వారి ఆలయం నుండి వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు కేశవ స్వామి మాలదారులు 150 శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో ర్యాలీ జగన్మోహిని కేశవ స్వామి వారి మాల దీక్ష దారులు కాలినడక ద్వారా వెళ్ళి గోవింద నామస్మరణతో శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు అని కార్యనిర్వాహణాధికారి తెలియజేశారు.

# తల్లితండ్రుల నమ్మకాన్ని నిలబెడుతున్నాం

## సాయి తేజ విద్యానికేతన్ డైరెక్టర్ టి భాను రేఖ



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరంలో సాయి తేజ విద్యానికేతన్ పాఠశాల 28వ వార్షికోత్సవం బుధవారం సాయంత్రం కర్రీ సందీప్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి అకాడమిక్ డైరెక్టర్ కర్రి భాను రేఖ మాట్లాడుతూ తల్లిదండ్రుల మాపై పెట్టిన నమ్మకాన్ని నిలబెడుతున్నామని తెలిపారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనపర్తి నియోజకవర్గ శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ప్రముఖ రచయిత పి ఎస్ రెడ్డి ( పైడిపాల), సినీ నటుడు బి గౌతమ్ రాజు పాల్గొన్నారు, అనంతరం విద్యా సంవత్సరంలో జరిగిన వివిధ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ఐఐటీ, ఒలంపియాడ్, అబాకస్, స్టడీ ఎక్స్ పోలో గెలుపొందిన విద్యార్థులకు ప్రధమ,ద్వితీయ బహుమతులను ముఖ్య అతిధుల చేత మీదుగా అందించారు. విద్యార్థిని, విద్యార్థుల సాంస్కృతిక వినోద ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఎం.ఈ.ఓ వై సూర్యనారాయణ, చాణిక్య నర్సింగ్ హెూమ్ అధినేత జివిఎస్ఎన్ రెడ్డి, ఎస్.బి.ఎస్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సత్తి బులిస్వామి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# నేడు విద్యుత్ సరఫరా బంద్

**మండపేట టౌన్, విశ్వం వాయిస్ :** మండపేట లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే రత్నాల రావు తెలిపారు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బైపాస్ రోడ్డు ,సంగంకాలని , విజయలక్ష్మినగర్, సత్య శ్రీ రోడ్డు, మెయిన్ రోడ్డు, బస్ స్టాండ్ రోడ్డు, తర్వాణి పేట, పెద్ద కాలువ వంతెన, వీరభద్రపురం, బ్యాంకు కాలని, శ్రీ లక్ష్మి నగర్, మెహర్ ఆశ్రమం వివిధ ప్రాంతాలలో సరఫరా నిలుపుదల చేస్తారు. మండపేట టౌన్ లో ఉన్న విద్యుత్ లైన్ ల మరమత్తులు చెట్టు కొమ్మలు తొలగింపు పనులు కోసం సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు.

## కొత్తపేట మండలంలోని పలు ప్రాంతాల్లో

# విద్యుత్‌కు అంతరాయం



**కొత్తపేట విశ్వం వాయిస్ న్యూస్ :** 33 కె.వి.ముక్కామల ఫీడర్ బిల్లకుర్రు యస్ యస్ 33/11 కె.వి.లైన్ పరిదిలో ట్రీ కటింగ్ కొరకు సబ్‌స్టేషన్ పరిదిలో ఉన్న పరిసర ప్రాంతాలు, వానపల్లి పరిధిలోని గ్రామాలు, బిల్లకుర్రు పరిధిలోని గ్రామాలు మరియు కొత్తపేట యస్ యస్ పరిధిలో మరమ్మత్తుల కొరకు మందపల్లి, కేదార్లంక, నారాయణలంక, వాడపాలెం, బండారుపేట, చిన్నమెరక ,పెద్ద మెరక, కొత్తపాలెం, అవిడి, కండ్రిగ, మద్దులమెరక, పనసలదొడ్డి, కొత్తపేట మొత్తం చిన్నగుళ్ళపాలెం, పెద్దగుళ్ళపాలెం, బోడిపాలెం ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగును. కావున విద్యుత్ వినియోగ దారులు అందరూ సహకరించవలసిందిగా కోరుచున్నాము అని కె. రాంబాబు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలియజేశారు.

## వద్దిపర్రు తారు రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన

# ఎమ్మెల్యే సత్యానందరావు



**కొత్తపేట ఆత్రేయపురం. విశ్వం వాయిస్ న్యూస్ :** ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గ్రామంలో అమలాపురం – బొబ్బర్లంక ప్రధాన రహదారి నుండి రజకుల పేటకు వయా ఏటిగట్టు మీదుగా ఎంపీ లాడ్స్ (రాజ్యసభ) నిధుల నుంచి 50 లక్షల రూపాయల అంచనాలతో వేయనున్న నూతన తారు రోడ్డుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శంకుస్థాపన చేశారు. అలాగే గోదావరి గట్టు నుంచి ఎస్సీ కాలనీ మీదుగా వద్దిపర్రు పంచాయితీ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిని అభివృద్ధి పరుచుటకు ఎంపీ లాడ్స్ (రాజ్యసభ) నుండి 50 లక్షల రూపాయలతో నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సత్యానందరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్ ), కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాధం,పి ఎస్ రాజు,జుజ్జవరపు శ్యామల హరిబాబు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల వద్దకే ప్రజా ప్రభుత్వం

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం ఎమ్మెల్యే సత్యానందరావు



**కొత్తపేట ఆత్రేయపురం విశ్వం వాయిస్ న్యూస్ :** రైతుల వద్దకే ప్రభుత్వాన్ని తీసుకొస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ఆత్రేయపురం లొల్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల ద్వారా రబీ సీజన్ ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్ముకోవడానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ధాన్యం ఎక్కడో సుదూర ప్రాంతాల మిల్లుకు తీసుకెళ్లేవారని గుర్తు చేసారు. సరైన పద్ధతి లేక ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నానా కష్టాలు పడి ధాన్యం అమ్మితే ఆ సొమ్ము ఎప్పుడు వస్తాదో కూడా అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లోనే రైతుల ధాన్యం రైతుల సమక్షంలోనే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ధాన్యం సొమ్మును రైతుల ఖాతాల్లో వేయడానికి 48 గంటలు సమయం ఇచ్చినా కేవలం రెండు గంటల వ్యవధిలో సొమ్ములు జమ చేయడం జరిగిందని చెప్పారు. ఈ రబీ సీజన్లో సాధారణ రకం ధాన్యం క్వింటాకు 2300 రూపాయలు,75 కేజీలకు 1725 రూపాయల చొప్పున కనీస మద్దతు ధర ఇస్తున్నామన్నారు. అలాగే ఎ రకం గ్రేడ్ ధాన్యం క్వింటాకు 2320 రూపాయలు,75 కేజీలకు 1740 రూపాయలు కనీస మద్దతు ధర ఉందన్నారు. అంతే కాకుండా గోనె సంచుల,హమాలీ మరియు రవాణా చార్జీలను రైతుల ఖాతాల్లోకి చెల్లించే వెసులు బాటును కూటమి సర్కార్ కల్పించిందని తెలిపారు. రైతే రాజు అన్న మాటను నిజం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకట రాజు (గబ్బర్ సింగ్ ),కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాధం,దాట్ల సూర్యనారాయణ,కల్లూరి సత్తిపాండు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంజినీర్ల ఆధ్వర్యంలో ఆహ్లాదంగా

# 2 కె 25. క్రీడా ఉత్సవాలు




**అమలాపురం టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ డా. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా విభాగం ఆధ్వర్యంలో డ్రీమ్ 2కె 25 జిల్లా స్థాయి క్రీడా ఉత్సవాలు ఆహ్లాదంగా జరిగాయి. అమలాపురంలోని బాబు జగ్గజీవన్ రావు కమ్యూనిటీ హాలులో జరిగిన ఈ కార్యక్రామనికి జిల్లా పంచాయతీ రాజ్ అధికారి పి. కృష్ణా రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. రాము, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి హెచ్ ఎన్ వి కృష్ణ రెడ్డి, డ్రెయిన్స్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎమ్ వి వి. కిషోర్, పంచాయత్ రాజ్ ప్రాజెక్ట్స్ డీ.ఈ.ఈ. అన్యం రాంబాబు, పంచాయత్ రాజ్ అమలాపురం సబ్ డివిజన్ డీ.ఈ.ఈ. పి.ఎస్ రాజ్ కుమార్, పి.గన్నవరం పంచాయితీ రాజ్ డి.ఇ.ఇ వి.చంద్రశేఖర్, కొత్తపేట పంచాయితీ రాజ్ డీ.ఈ.ఈ. ఏ వి సూర్యనారాయణ, ముమ్మిడివరం పంచాయితీ రాజ్ డి.ఇ.ఇ. పి.వి శ్రీనివాసరావు మరియు పంచాయితీ రాజ్ ఏఈ లు, జిల్లాలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమక్షంలో ఘనంగా నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో వివిధ క్రీడలలో విజేతలు మరియు రన్నర్లకు బహుమతుల ప్రదానం చేసారు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు క్రింద స్థాయిలో పడుతున్నా సమస్యలను తెలియజేసారు అలాగే ప్రభుత్వం తలపెట్టిన గ్రామ సచివాలయాల హేతుబద్ధీకరణలో భాగంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లకు కేటాయించే విధంగా ప్రభుత్వానికి నివేదించవలసిందిగా అధికారులను కోరుతున్నారు. కార్యక్రమంలో ఈఈ కార్యక్రమములో ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాలె సురేష్, ప్రధాన కార్యదర్శి శాలెం రాజ్, మిగత అసోసియేషన్ సభ్యులు మరియు సుమారు 300 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల

## సంగం బడి లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ :** సాధారణ ప్రైవేటు పాఠశాలలు తమ విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తారు. పట్టభద్రుల దినోత్సవాలు నిర్వహించి అట్టహాసంగా కార్యక్రమాలు చేస్తారు. వీరికి ధీటుగా మండపేట సంఘం కాలని ఎంపిపి ప్రాథమిక పాఠశాల లో పలు కార్యక్రమాలు నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారు. పేరు కు ప్రభుత్వ పాఠశాల కానీ ఇక్కడ విద్య భోధన నుండి అన్ని ప్రైవేటు పాఠశాల కు పోటీగా వుంటాయి. ప్రతి ఏడాది ప్రతి పండుగ వేడుకలు నిర్వహించడం విశేషం. ఇక్కడి ఉపాధ్యాయులు నిబద్ధత దీనికి కారణం. ఈ నేపథ్యం లో పాఠశాల లో పట్టభద్రుల దినోత్సవాలు వైభవం గా నిర్వహించారు. గ్రాడ్యూట్ డ్రెస్ ల్లో తమ చిన్నారులను చూసి తల్లిదండ్రులు ఉప్పొంగి పోయారు. సంగమేశ్వర కాలనీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ముత్యాల మాణిక్యంబ ఆధ్వర్యంలో ప్రాథమిక విద్య పూర్తిచేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి నాయుడు రామచంద్రరావు విద్యార్థులు కు గ్రాడ్యుయేషన్ డే సర్టిఫికెట్స్ అందజేసారు. ఉన్నత శిఖరాలను అవరోధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ పి నారాయణరావు, ఉపాధ్యాయులు చిట్టూరి వెంకట శ్రీధర్, విద్యార్థులు తల్లిదండ్రుల పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## ఇంధన భారం!

అచ్చే దిన్ గురించి అస్తమానూ కబుర్లు వల్లించే మోడీ ప్రభుత్వం సామాన్య జనం నెత్తిన మళ్లీ గ్యాస్ బండ భారం మోపింది. అటు పెట్రోలు, డీజిల్ పైనా రూ.2ల చొప్పున సుంకం బనాయించింది. 'ఏడ్చిపోదురు గాక నాకేటి వెరపు?' అన్న చందంగా జనంపై భారాలు మోపటం మోడీ హయాంలో ఇదే మొదటిసారి కాదు. ప్రజలు కోవిడ్ కష్టకాలంలో విలవిల్లాడిపోయిన సందర్భాల్లో కూడా వంట గ్యాస్, పెట్రో భారాలు మోపిన ఘనత కేంద్ర ప్రభుత్వానిది. ఎల్‌పిజిపై ప్రజలకు బోలెడంత రాయితీ ధారబోస్తున్నామంటూ బొంకి, నెమ్మది నెమ్మదిగా సబ్సిడీ మొత్తానికి సర్వమంగళం పాడిన మోసకారితనం మోడీ అండ్ కోది. దాదాపు పదేళ్ల క్రితం నగదు బదిలీపై గొప్పగా ఢంకా బజాయించి, సబ్సిడీ సొమ్మును నేరుగా వినియోగదారుల ఖాతాల్లోనే జమ చేస్తామంటూ చెప్పారు. ఆ తరువాత 14.2 కేజీల సిలిండరు ధరను రూ.420 నుంచి రూ.1100 వరకూ పెంచుకుంటూ పోయారు. ప్రారంభంలో రూ.రెండొందలకు పైగా ఖాతాల్లో జమైన రాయితీ సొమ్ము ఇప్పుడు రూ.15ల నామమాత్రానికి కరిగిపోయింది. ఈ విధంగా దేశంలోని 32.83 కోట్ల మంది ఎల్‌పిజి వినియోగదారులను చెప్పాపెట్టకుండా రాయితీని తెగ్గోసి, మోసగించింది బిజెపి ప్రభుత్వం. పాతికేళ్ల క్రితం వరకూ ఏడాదికొకసారి పెట్రో ఉత్పత్తుల ధరలను సవరించటం, పూలింగ్ పద్ధతిలో ధరల సర్దుబాటు చేయటం విధానంగా ఉండేది. దానిని పూర్తిగా నిర్వీర్యం చేసి, అంతర్జాతీయ ఇంధన మార్కెట్టులోని హెచ్చుతగ్గులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ధరల్లో మార్పులు ఉంటాయని కేంద్ర పాలకులు ప్రకటించారు. ధరలు పెరిగినప్పుడు పెంచటం, తగ్గినప్పుడు తగ్గించటం సహజంగానే జరిగిపోతుందని చెప్పుకొచ్చారు. నిజానికి ఆచరణలో జరుగుతున్నదేమిటి? భారం పెరిగితే జనం మీదికి నెట్టటం, ధర తగ్గితే చమురు కంపెనీల ఖాతాల్లోకి మళ్లించటం మామూలుగా మారింది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గినప్పుడల్లా ఎక్సైజ్ సుంకాన్ని పెంచటం రివాజు అయింది. 2014 నవంబరు నుంచి 2016 జనవరి వరకూ తొమ్మిదిసార్లు సుంకాన్ని పెంచారు. వినియోగదారులకు దక్కాల్సిన తగ్గింపును ప్రభుత్వమే కొట్టేయటం మోసకారితనం కాక మరేమిటి? అంతర్జాతీయ చమురు మార్కెట్లో నెలకొన్న పరిస్థితుల రీత్యా వాస్తవానికి పెట్రో ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గాల్సి ఉంది. 2014 నాటితో పోలిస్తే ఇప్పుడు 41 శాతం మేర చమురు ధరలు తగ్గాయి. దానిని యథాతథంగా అమలు చేస్తే లీటరు పెట్రోలు, డీజిలు ధరలు రూ.70ల లోపే ఉండాలి. అమెరికా ఆంక్షల నేపథ్యంలో రష్యా మనకు గతంలో కన్నా తక్కువ ధరకే ముడి చమురును విక్రయిస్తోంది. ఈ అవకాశాన్ని దేశీయ కార్పొరేటు కంపెనీలు అధిక లాభాలు ఆర్జించటానికి మోడీ ప్రభుత్వం అందిస్తోంది తప్ప ఆ తగ్గింపును ప్రజల వైపు మళ్లించటం లేదు. పైగా ఎన్నికల వేళ చమురు ధరల ఆధారంగా లబ్ధి పొందేందుకు కుయుక్తులకు దిగుతోంది. కోవిడ్ విపత్తు కాలంలోనూ ప్రజలపై కనికరం చూపని మోడీ ప్రభుత్వం%ౌ% ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలోనూ, సార్వత్రిక ఎన్నికల తరుణంలోనూ తగ్గింపు జిమ్మిక్కులు ప్రదర్శించింది. రూ.1050 వరకూ పెంచిన వంట గ్యాస్‌పై రూ.200, రూ.111 వరకూ పెంచిన పెట్రోలు ధరపై రూ.2లు తగ్గించి, పెద్ద ఉపశమనం చేకూర్చినట్టు ప్రచారం చేసుకొంది. కార్పొరేట్ల సేవ, అధికార యావ తప్ప ప్రజలపై భారాలు తగ్గించే బాధ్యతాయుత ఆచరణ బిజెపి ప్రభుత్వానికి లేదనటానికి తాజా పెంపు ఉదాహరణ. తగిన ఆదాయాలు లేక ప్రజల్లో కొనుగోలు శక్తి రోజురోజుకీ తగ్గిపోతున్న వాస్తవం అనేక రూపాల్లో కళ్ల ముందు కనిపిస్తోంది. కోవిడ్ తరువాత నిత్యావసరాల ధరలు భారీగా పెరిగి, మళ్లీ కిందికి చూడడం లేదు. ధరలను అదుపులోకి తేవాల్సిన పాలకులు ఆ పని చేయకపోగా, అవి మరింత పెరగటానికి కారణమయ్యే ఎల్‌పిజి, పెట్రో ధరలను పెంచటం బాధ్యతారాహిత్యం. పేదల జీవితాల్లో వెలుగులు నింపటానికి అంటూ తీసుకొచ్చిన ఉజ్వల పథకం వినియోగదారులపైనా రూ.50ల పెంపు గ్యాస్ వినియోగాన్ని పక్కన పెట్టి, మళ్లీ కట్టెల మోపు వైపు నెట్టటానికే ఉపయోగపడుతుంది. కాబట్టి, పెంచిన ఎల్‌పిజి ధరను ఉపసంహరించటంతో పాటు రాయితీని భారీగా పెంచాలి.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# జగన్ పాలనలో ప్రాజెక్టులన్నీ కుదేలే

- ఆ ఐదేళ్లలో 120 పథకాలు ఎక్కడివక్కడే
- 57 ప్రాజెక్టుల్లో తట్టెడు మట్టీ ఎత్తలేదు
- మిగతా 63లో నాలుగో వంతు పనులూ కాలేదు
- విధ్వంసం నుంచి బయటపడడమెలా?
- జలవనరుల శాఖ మల్లగుల్లాలు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ గద్దెనెక్కక ముందే రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల విధ్వంస రచనకు ప్రణాళికలు వేసినట్లు ఆయన అనుసరించిన విధానమే చాటుతోందని సాగునీటి రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. పగ్గాలు చేపట్టిన వెంటనే.. శరవేగంగా నడుస్తున్న పోలవరం పనులు ఆపేశారు. కేంద్రం వద్దంటున్నా కాంట్రాక్టు సంస్థను తొలగించారు. రివర్స్ టెండర్ పేరిట విధ్వంసానికి బీజం వేశారు. ఇదే కాదు.. 25శాతం పనులు పూర్తికాని అన్ని ప్రాజెక్టుల కాంట్రాక్టులనూ నిరంకుశంగా కనీసం నోటీసైనా ఇవ్వకుండా రద్దు చేశారు. ఆ వెంటనే తన అస్మదీయ సంస్థలకు కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారం పనులు కట్టబెట్టారు. ఐదేళ్ల జగన్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులను ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తరచూ సమీక్షిస్తున్నప్పుడు కళ్లు చెదిరే నిజాలు ఒక్కటొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మొత్తం 120 ప్రాజెక్టుల్లో 57 ప్రాజెక్టులు పనుల ప్రారంభానికే నోచుకోలేదు. వీటిలో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు... పోయలేదు. మరో 53 పథకాలకు పాలనామోదం లభించినా.. నాలుగో వంతు పనులైనా పూర్తికాలేదు. జగన్ నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టుల్లో బుడమేరు మళ్లింపు-ఆధునికీకరణ పథకం, ముక్త్యాల ఎత్తిపోతల, గోదావరి-పెన్నా మొదటి దశ, వరికిపూడిశెల ఎత్తిపోతల, హంద్రీ-నీవా సుజల స్రవంతి రెండో దశ, రాయలసీమ ఎత్తిపోతల, రాజోలిబండ మళ్లింపు పథకం, వేదావతి ఎత్తిపోతల, జీడిపల్లి రిజర్వాయరు-భైరవానితిప్ప ఎత్తిపోతల, గాలేరు-నగరి సుజల స్రవంతి, హంద్రీ-నీవా(చక్రాయపేట), అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ వంటివి ఉన్నాయి.

**మొదలే కాని ప్రాజెక్టులు :**

ప్రాజెక్టు పనులు ప్రారంభం కానివాటిలో ఉత్తర కోస్తా చీఫ్ ఇంజనీర్ పరిధిలో 4, గోదావరి డెల్టా సిస్టమ్, ధవళేశ్వరం చీఫ్ ఇంజనీర్ పరిధిలో ఒకటి, కృష్ణా డెల్టా సీఈ పరిధిలో 4, ఒంగోలు సీఈ పరిధిలో 4, నాగార్జునసాగర్ సీఈ పరిధిలో రెండు, ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు (తిరుపతి) సీఈ పరిధిలో 12, కర్నూలు సీఈ పరిధిలో 4, అనంతపురం సీఈ పరిధిలో 7 ఉన్నాయి. కడపలో ఏకంగా 14 ప్రాజెక్టు పనుల్లో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. అంచనా వ్యయంలో 25శాతం కంటే తక్కువ పనులు జరిగిన ప్రాజెక్టులు 63 ఉన్నాయని జలవనరుల శాఖ తేల్చింది. వాటిలో ఉత్తర కోస్తా సీఈ పరిధిలో 15, ధవళేశ్వరం సీఈ పరిధిలో 5, పోలవరం సీఈ పరిధిలో 6, కృష్ణా డెల్టా సీఈ పరిధిలో 7, ఒంగోలు సీఈ పరిధిలో 2, నాగార్జునసాగర్ సీఈ పరిధిలో 1, తెలుగుగంగ సీఈ పరిధిలో 7, కర్నూలు సీఈ పరిధిలో 7, అనంతపురం సీఈ పరిధిలో 1, కడప సీఈ పరిధిలో 12 ప్రాజెక్టులు ఉన్నట్లు వెల్లడించింది. జగన్ నిర్లక్ష్యంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను పూర్తిచేయాల్సి బాధ్యత ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వంపై పడింది. అవన్నీ పూర్తిచేయాలంటే అంచనాలు పెంచాలి. కొత్త ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం అమలు చేస్తే.. ఆర్థిక భారం తడిసిమోపెడవుతుందని జలవనరుల శాఖ మల్లగుల్లాలు పడుతోంది. జగన్ విధ్వంసం నుంచి బయటపడే మార్గాలు అన్వేషిస్తోంది. ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టక తప్పదని స్పష్టం చేస్తోంది. పోలవరం ప్రాజెక్టు సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ మాజీ సీఎం జగన్ కక్షకు బలయ్యాయి. ఆయన ఐదేళ్ల ఏలుబడిలో ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టునూ పూర్తిచేయలేదు. పైగా రూపాయి కూడా ఇవ్వకుండా అన్నిటినీ నాశనం చేసేశారు. ఇప్పుడు వాటిని ముట్టుకోవాలంటేనే ప్రభుత్వం భయపడుతోంది. నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయింది. అలాగని వాటిని చేపట్టకుండా ఆపితే ప్రజలకు భారీ నష్టం. ఏం చేయాలో అర్థం కాక తర్జనభర్జన పడుతోంది.

# ఆరు - ముప్పయి ఆరు - అరవై ఆరు



'బుజ్జీ! ఏం చేస్తున్నావు? ఇందాక నీతో ఆడుకోవడం కోసం చిట్టి వచ్చింది' అని పిలిచింది రాధ. లోపల నుండి జవాబు రాలేదు. 'బుజ్జీ బుజ్జీ' మళ్ళీ గట్టిగా పిలిచింది. 'బుజ్జీ! మాట్లాడవేంటి?' వంటగదిలో నుండి హాల్లోకి వచ్చింది రాధ. బుజ్జి కుర్చీలో కూర్చుని తల్లి ఫోన్‌లో ఫిల్మీ మోజీ చూస్తూ పడీ పడీ నవ్వుకుంటుంది. అది చూడగానే రాధకు కోపం వచ్చింది. ' సమయం దొరికితే చాలు ఫోన్ పట్టుకుంటావు. మీ టీచర్ నువ్వు 'ఇది వరకటంత బాగా చదవడం లేదు'ని చెప్తున్నారు. ఫోన్ పక్కన పెట్టి కాసేపు చదువుకోవచ్చు కదా?' ఫోన్ లాక్కుంటూ అంది రాధ. అమ్మా! ప్లీజ్ అమ్మా! హోమ్ వర్క్ ఏమీ లేదు అన్నీ రాసేసాను. ప్లీజ్! కాసేపు ఫోన్ చూస్తాను' అంటూ రాగం తీసింది బుజ్జీ. 'హోమ్‌వర్క్ లేకపోతే ఆడుకోవచ్చుగా! ఇందాక నీ కోసం చిట్టి వచ్చింది' ఫోన్ ఇవ్వకుండా అంది రాధ. 'అబ్బా పోమ్మా! చిట్టితో కాసేపాగి ఆడుకుంటాను' అని రాగం పెద్దది చేసింది బుజ్జీ. 'నిన్ను మార్చడం నా వల్ల కావడం లేదు. పది నిముషాల తర్వాత నువ్వు ఫోన్ ఆపేసి ఆడుకోవడానికి వెళ్ళాలి సరేనా!' అంటూ ఫోన్ ఇచ్చింది రాధ. తిరిగి వంటగదిలోకి వెళ్ళబోతున్న రాధ చూపు బెడ్‌రూమ్ వైపు పడింది. అడుగులు అటువైపు వేసింది. గోపాల్ మంచం మీద పడుకుని తదేకంగా ఫోన్‌లో చాటింగ్ చేస్తున్నాడు. రాధ గదిలోకి రావడం కూడా పట్టించుకోలేదు. 'ఏవండీ? ఏం చేస్తున్నారు? రోజూ ఎలాగూ కుదరదు. కనీసం ఆదివారం రోజైనా ఇంటి విషయాలు పట్టించుకోవచ్చుగా?' దగ్గరకు వచ్చి అడిగింది రాధ. 'ఆదివారం ఒక్కరోజు సెలవు దొరికేది. ఏదో సరదాగా ఫోన్ పట్టుకుంటే ఏంటి నీ గొడవ?' విసుక్కున్నాడు గోపాల్. 'ఆ ఒక్కరోజూ నా కోసం, పాప కోసం కూడా వెచ్చించాలి కదండీ?' సౌమ్యంగా అంది రాధ. 'అనవసరంగా నన్ను విసిగించకుండా వెళ్ళు' కసురుకున్నాడు గోపాల్. రాధ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అక్కడ నుండి బయటకు వచ్చేసింది. అప్పుడే పక్కగదిలో నుండి నవ్వు వినిపించి అటు చూసింది. మంచం పక్కనున్న కుర్చీలో వెనక్కు తిరిగి కూర్చున్న రామారావు ఫోన్‌లోకి చూస్తూ పెద్దగా నవ్వుతున్నాడు. రాధ గదిలోకి రెండడుగులు వేసింది. తన్మయత్వంగా రీల్స్ చూస్తున్న ఆయన ఆమె అలికిడి వినిపించుకునే స్థితిలో లేడు. రెండు నిముషాలు అక్కడే నిలబడి బయటకు వచ్చేసింది. ఆమె మనసంతా తీవ్రమైన బాధతో నిండిపోయింది. 'ఈ ఇంట్లోని మనుషులకు ఏలా చెప్పాలి? ఎలా మారతారు?' అనుకుంటూ ఆమె కళ్ళలో నుండి నీళ్ళు ధారలుగా కారిపోతున్నాయి. చూపు మసకబారి, కూరగాయలు కోస్తున్న చాకు వేలి మీద బలంగా పడింది. అంతే! రక్తం చివ్వున చిమ్మింది. ఒక్కసారిగా స్పృహలోకి వచ్చి అందుబాటులో ఉన్న గుడ్డ తడిపి చేతికిచుట్టింది. కానీ రక్తం ఆగడం లేదు. చెయ్యి అలాగే పట్టుకుని భర్త దగ్గరకు వచ్చి 'ఏవండీ' అని పిలిచింది. 'రాధా! మరో గంట వరకు నన్ను డిస్ట్రర్బ్ చేయొద్దని ఎన్నిసార్లు చెప్పాలి' తల తిప్పకుండానే గట్టిగా అరిచాడు గోపాల్. అవమానంతో అక్కడ నుండి మామగారి దగ్గరకు వచ్చింది. 'మావయ్య గారు!' మెల్లిగా పిలిచింది రాధ. ఆయన వెనక్కు చూడకుండానే 'కాసేపాగి భోజనం చేస్తానమ్మా!' అన్నాడు. రాధ మౌనంగా అక్కడ నుండి హాల్లోకి వచ్చింది. బుజ్జీ సర్వం మరచిపోయి ఫోన్ చూస్తోంది. ఆమె వేలి నుండి రక్తం ఆగకుండా కారిపోతుంది. చిన్నప్పటి నుండి రక్తం చూస్తే రాధకు కళ్ళు తిరుగుతాయి. అందులో ఆమె చేతి నుండి వస్తున్న రక్తం చూసేసరికి కళ్ళు తిరిగి సోఫాకి ఆనుకుని 'అమ్మా' అంటూ నేల మీదకు వాలిపోయింది. ఆ అరుపుకి బుజ్జి తలెత్తి చూసింది. వెంటనే 'అమ్మా%ౌ%' అని పరుగెత్తుకుంటూ తల్లి దగ్గరకు వచ్చింది. అప్పటికే రాధకు మైకం కమ్మినట్లు అనిపించింది. 'డాడీ%ౌ% డాడీ' అని ఏడుస్తూ అరిచింది బుజ్జీ. గోపాల్, రామారావు ఇద్దరూ ఫోన్లు పట్టుకునే అక్కడకు వచ్చారు. నేల మీద పడున్న రాధను, ఆమె చేతి నుండి కారుతున్న రక్తాన్ని చూసి కంగారుపడ్డారు. గోపాల్ రక్తం కారుతున్న చేతి వేలుని గుడ్డతో నొక్కి పట్టుకున్నాడు. రామారావు గ్లాసుతో నీళ్ళు తెచ్చి కోడలి ముఖాన చిమ్మాడు. రాధ కళ్ళు తెరిచి భర్తను, మామగారిని, ఏడుస్తున్న కూతురిని చూసింది. 'రాధా! అసలేమైంది?' అన్నాడు గోపాల్. 'కూరగాయలు కోస్తుంటే వేలు తెగింది. 'ఇంత రక్తం పోతుంటే పిలవొచ్చుగా గోపాల్, రామారావు ఇద్దరూ ఒక్కసారే అన్నారు. 'పిలిచాను కానీ' వాళ్ళను చూస్తూ ఆపేసింది రాధ. ఇద్దరి ముఖాలలో రంగులు మారిపోయాయి. జరిగింది గుర్తు చేసుకున్నారు. ఇంత జరిగినా కోప్పడని రాధ మంచితనాన్ని వారు అర్థంచేసుకున్నారు. పలుచబడుతున్న కుటుంబ బంధాలకు కారణమైన ఫోన్ వైపుకి చూసారు. 'గోపాల్!అమ్మాయిని ఆస్పత్రికి తీసుకెళ్ళు. వంట సంగతి నేను చూసుకుంటాను. బుజ్జీ! నువ్వు నాతో రా!. మనం కబుర్లు చెప్పుకుంటూ పని చేద్దాం' అన్నాడు రామారావు.రాధ ముఖంలో మునుపటి నవ్వు వికసించింది.

## ప్రొటీన్ ఫుడ్‌తో టీబీ దూరం



రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు టీబీ బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో, వైరస్, బ్యాక్టీరియాకు వ్యతిరేకంగా శరీరాన్ని బలోపేతం చేయడంలో ఆహారం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. టీబీ ఉన్నవారు బరువు తగ్గడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో బరువు కోల్పోకుండా టీబీ రోగులు అధిక కేలరీలు, పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవాలి. విటమిన్ ఎ, సి, ఈ, డి వంటి విటమిన్లు ఆరోగ్యకరమైన రోగ నిరోధక వ్యవస్థకు కీలకం. ఇవి డ్రైఫ్రూట్స్, నట్స్, పుట్టగొడుగులు, క్యారెట్ వంటి వాటిల్లో సమృద్ధిగా లభిస్తాయి. వీటిని రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే టీబీ నుంచి బయట పడొచ్చు. మరి వాటిని ఎలా తయారుచేసుకోవాలో తెలుసుకుందాం.

క్యారెట్ హల్వా

కావాల్సినవి : క్యారెట్ - కిలో, బెల్లం- రెండు కప్పులు, నెయ్యి- కావాల్సినంత, యాలకుల పొడి- స్పూను, డ్రై ఫ్రూట్స్-కప్పు, చిక్కటిపాలు- అర గ్లాసు.

తయారీ : క్యారెట్‌ను చెక్కు తీసి, సన్నగా తురుముకోవాలి. అడుగు మందంగా ఉన్న కడాయిని స్టవ్ మీద పెట్టాలి. మంట సిమ్‌లో ఉంచి, నెయ్యి వేసి, వేడయ్యాక క్యారెట్ తురుము వేసి మూతపెట్టాలి. క్యారెట్ ఓ ఐదు ఆరు నిమిషాలకు మెత్తగా ఉడుకుతుంది. అడుగంటకుండా కలుపుతూ ఉడికించాలి. బెల్లం వేసి గరిటెతో కలయతిప్పాలి. పాలు కూడా పోసి, దగ్గరకు వచ్చాక నెయ్యి వేసి కలపాలి. చిన్నమంట మీద బాగా ఉడకనివ్వాలి. హల్వా గట్టి పడిన తర్వాత కడాయి దించి, పక్కన పెట్టుకోవాలి. అందులో యాలకులపొడి, వేయించిన డ్రై ఫ్రూట్స్ వేసుకోవాలి. అంతే ఏంతో ఆరోగ్యకరమైన క్యారెట్ హల్వా రెడీ.

## పూలల్లో జిగేల్ రాణి.. జిన్నియా..



జిన్నియా అనేది ఆస్టరేసి కుటుంబంలోని హేలియాంథియే తెగకు చెందిన మొక్కల జాతి . ఇవి మెక్సికోలో వైవిధ్యానికి కేంద్రంగా ఉన్న నైరుతి యునైటెడ్ స్టేట్స్ నుండి దక్షిణ అమెరికా వరకు విస్తరించి ఉన్నాయి. ఇవి వివిధ రకాల ప్రకాశవంతమైన రంగులలో కనువిందు చేస్తాయి. గుత్తంగా.. రేకగా.. పూలు విరబూస్తాయి. రెండు, మూడు రంగుల మేళవింపుతో కలబోత రంగులతో మనసును దోచేస్తాయి. వీటిని బంగాళా బంతి అని కూడా పిలుస్తారు. ఇవి బంతిలాగానే పూలు ఎండిపోయాక పూల రేకులే విత్తనాలుగా మొలకెత్తుతాయి. వీటిని ముందుగా నారు పోసుకుని, నాటుకోవాలి. ఇవి నేలలో మనిషిని మించిన ఎత్తుకూ ఎదుగుతాయి. కుండీల్లో ఒద్దికగానూ పెరుగుతాయి. పూలు మాత్రం మంచి మంచి రంగుల్లో ముద్దగా.. ముద్దులొలుకుతూ పసిపాప నవ్వులా బాగుంటాయి.

# 11 న ఆంధ్రాశబరిమల అయ్యప్ప జన్మదిన వేడుకలు



## 14న విషు పండుగ

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం పెదమల్లాపురం పంచాయతీ శివారు సిద్దివారిపాలెంలోని ఆంధ్రా శబరిమలగా ప్రసిద్ధి చెందిన అయ్యప్ప ఆలయ పుణ్యక్షేత్రంలో స్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు భూపతి, గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఆంధ్రా శబరిమల ట్రస్ట్ చైర్మన్ కుసుమంచి శ్రీసత్య శ్రీనివాసరావు గురుస్వామి తెలిపారు. శుక్రవారం 11 వ తేదీన అయ్యప్పస్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి హెరీమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం స్వామి వారికి ఉయ్యాల సేవ నిర్వహించి, మధ్యాహ్నం పూట భక్తులకు అన్న ప్రసాద వితరణసేవ చేస్తామన్నారు. కేరళలోని శబరిమలై అయ్యప్ప స్వామికి ప్రతీ ఏడాదీ ఏప్రిల్ 14 న విషు పండుగను నిర్వహించే సంప్రదాయం మాదిరిగా ఇక్కడి ఆంధ్రా శబరిమలైలో కూడా అంతే సంప్రదాయబద్దంగా విషు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. 14 న ఉదయం అయ్యప్ప స్వామికి వేద పండితులతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హెరీమాలు నిర్వహించి, ఉత్సవ మూర్తిని 18 మెట్ల మీదుగా తీసుకొచ్చి ఆలయం ఎదురుగా ఉన్న కోనేటిలో స్వామికి భక్తుల సమక్షంలో పుణ్యస్నాన ఘట్టం పూర్తి చేస్తామన్నారు. ఆంధ్రా శబరిమలైలో నిర్వహించే ఈ రెండు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భక్తులు తరలి రావాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కుసుమంచి శ్రీసత్యశ్రీనివాసరావు గురుస్వామి పిలుపును ఇచ్చారు.



# భా.జ.పా. బలోపేతానికి కృషి చేయాలి

## కామర్స్ చిరంజీవి పిలుపు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ పురోభివృద్ధికి పార్టీ క్రియాశీలక సభ్యులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు అందరూ ఐకమత్యంతో కృషి చేయాలని కామర్స్ చిరంజీవి పిలుపును ఇచ్చారు. కాకినాడ జిల్లా భా.జపా. అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు సూచనలు మేరకు నియోజకవర్గం కేంద్రం ప్రత్తిపాడులోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త సింగిలిదేవి సత్తిరాజు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమ ఇంచార్జి, ముఖ్య అతిథి కామర్స్ చిరంజీవి పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్నికల బూత్ కమిటీ సభ్యులు, క్రియాశీలక సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, గావ్ ఛలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా నాయకులు అందరూ శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు పల్లెల్లో 8 గంటలు పాటు పార్టీ పర్యటన చేయాలని కామర్స్ చిరంజీవి తెలిపారు. అనంతరం సింగిలిదేవి సత్తిరాజు మాట్లాడుతూ... భారత స్వాతంత్ర్య సంగ్రామ పోరాటంలో అసువులు బాసిన మహాత్ముల విగ్రహాలను ఈ నెల 13 న శుభ్రం చేయాలని, ఆ సాయంత్రమే ఆయా విగ్రహాల వద్ద జ్యోతిని వెలిగించాలని పేర్కొన్నారు. అలాగే ఏప్రిల్ 14 న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామాల్లో ప్రచారం చేయాలని సమన్వయకర్త సింగిలిదేవి సత్తిరాజు పిలుపును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా భా.జ.పా. కార్యదర్శి కొల్లా శ్రీనివాస్,యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు చిట్రా పాపారావు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు విజయకుమార్, రాజా కింగ్ బాబురాజు, వెలుగురు హరేరామ, కంద వీరాస్వామి, గున్నాబత్తుల రాజబాబు, ఉషారాణి, బొమ్మిడి లోవరాజు, నక్కా శ్రీను, గట్టెం సీతారాం, దేవర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### రెండు గ్రామాల పోలవరం సమస్యపై వెంటనే స్పందించిన

# ఎంఎల్ఏ మిరియాల శిరీష దేవి

## లిలరకు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి -గడేసుల రంజిత్ కుమార్



**కూనవరం విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా, కూనవరం మండలంలో అరకు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో ఈ రోజు రంపచోడవరం ఎంఎల్ఏ మిరియాల శిరీష దేవినీ వారి క్యాంప్ కార్యాలయంలో కలిసి కూనవరం మండలంలో ఉన్న కాచవరం,పోచవరం గ్రామాలను పోలవరం 41.15 మొదటి కాంటూరు లో చేర్చాలని 2006 లో వచ్చిన గోదావరి వరద లెక్కల ప్రకారం అప్పటి ప్రభుత్వం కాచవరం పోచవరం పంచాయితీ లను మరూన్ గ్రామాలుగా అంటే చుట్టూ వరద నీరు ఉండి మధ్యలో గ్రామాలు ఉంటాయి అని దాని అర్థం అందువలన అప్పటి ప్రభుత్వం మరూన్ గ్రామాలుగా ప్రకటించడం జరిగింది ఈ లెక్కల ప్రకారం ఈ గ్రామాలను 41.15 కాంటూరు లో చేర్చి ప్యాకేజి ఇప్పించి ఈ గ్రామల ప్రజలను ఆదుకోవాలని కోరడం జరిగింది ఈ సమస్యపై ఎంఎల్ఏ మిరియాల శిరీష,భాస్కర్ వెంటనే స్పందించి సంభందిత అధికారులతో వీటి సాధ్యాసాధ్యాలను గురించి మాట్లాడి ఈ సమస్యను వెంటనే రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గారితో మాట్లాడుతానని సీఎం గారి నోటీసుకు తీసుకువెళ్ళి ఈ గ్రామాలను మొదటి 41.15 కాంటూరు లో చేర్పించి ఆ గ్రామల ప్రజలను ఆదుకుంటానని భరోసా ఇచ్చి వెను వెంటనే సీఎం చంద్రబాబు మంత్రివర్యులు నారా లోకేష్ మంత్రి వర్యులు నిమ్మల రామానాయుడు లకు వెంటనే లేఖ రాయడం జరిగింది.ఎంఎల్ఏ మిరియాల శిరీష,భాస్కర్ లు తక్షణ స్పందన పై రెండు పంచాయితీల ప్రజలు ఎంఎల్ఏ దంపతులకు ధన్యవాదాలు తెలియచేసారు.ఇన్ని సంవత్సరలుగా చాలా మంది ఎంఎల్ఏ లుగా ఎంఎల్సి గా ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవని కానీ ప్రస్తుత ఎంఎల్ఏ మిరియాల శిరీష పోలవరం సమస్యపై అసెంబ్లీ లో మాట్లాడడం మాత్రమే కాకుండా వారి వద్దకు వెళ్లిన కొన్ని సంవత్సరాలుగా సాధ్యం కాని పనులను సిఎం దృష్టికీ మంత్రుల దృష్టికి ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యలకు పరిష్కారం అయ్యేలా చేస్తున్నారని వారికి మా రెండు పంచాయతీల ప్రజల తరపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియచేసుకుంటూ ఎంఎల్ఏ మిరియాల శిరీష,భాస్కర్ దంపతులు మరిన్ని సంవత్సరాలు ఎంఎల్ఏ గా గెలిచి మరి ఇంకా మంచి పనులు చేసి ప్రజల మన్ననలు పొందాలని ఆశిస్తున్నామని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్, మడకం రామారావు, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, కొర్రపాటి శివాజీ, మడెం సాయి, నూప శేఖర్,వాసం లక్షణరావు, చంద్రుగొండ శ్రీను,మిండ బాలకృష్ణ,మిండ హరి, పింకసూర్యాచందరావు, కాపుల మహేష్,బొర్రా రాంబాబు, నల్లగొర్ల రాజు, కొర్రపాటి శ్రీను,తోటకూరి వీర్రాజు, షేక్ శుభాన్, కట్టం నాగేశ్వరావు, మల్లాది రాంబాబు, పోలేటి ఈశ్వరరావు, పూనం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


# పోలీసుల ఆధ్వర్యంలో మెగా వాలీ బాల్ టోర్నీ



**రంపచోడవరం విశ్వం వాయిస్ న్యూస్ :** గిరిజన యువత క్రీడల పట్ల ఆసక్తి కనబరచడం ద్వారా మానసిక శారీరక ఉల్లాసం తో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశలు పొదవొచ్చని అల్లూరి జిల్లా ఓ ఎస్డ్ జగదీశ్ ఆడహాల్లి పేర్కొన్నారు. ఈ రోజు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు రంపచోడవరం జగదీష్ అడహల్లి ఓ.ఎస్.డి ఆపరేషన్స్, రంపచోడవరం జి.ఎస్ ప్రశాంత్ సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్, రంపచోడవరం వారి ఆధ్వర్యంలో వై.రామవరం మండలం గుర్తేడు గ్రామం లో మెగా వాలీబాల్ టోర్నమెంట్ ను ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువత గంజాయి, %ఎశ్రీశీస్త్ర% పందెం, పేకాట వంటి అసాంగీక కార్యా కాలాపాలకు దూరంగా ఉండాలిని సూచించారు. ఈ కార్యక్రమం లో గుర్తేడు సర్పంచ్ దుష్యం త్ , రామచోడవరం డి ఎస్పీ సాయి ప్రశాంత్, గుర్తేడు ఎస్ ఐ , స్థానిక యువత పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

### పలువురుని సన్మానించిన వాడపల్లి

# కార్యనిర్వహణ అధికారి



**కొత్తపేట ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుపతి శ్రీ వాడపల్లి వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం భాగంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలపకుండా సేవలందించిన జిల్లా ఉప ఆరోగ్య శాఖ అధికారి డా" సుమలత.ఆత్రేయపురం ఎంపీడీవో బి కె యస్ యస్ వి ప్రసాద్. రావులపాలెం ఆర్టీసీ టీ జీ వి రమణ విరికి ఆలయ డిప్యూటీ కమిషన్ మరియు కార్యనిర్వహణ అధికారి సన్మానించారు.

### దేవగుప్తం సబ్ స్టేషన్ ఫరిదిలో

# శుక్రవారం పవర్ కట్

**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్ :** దేవగుప్తం సబ్ స్టేషన్ పరిదిలో గల 11 కేవీ గుండిపూడి ఫీడర్ అండ్ 11కేవీ తూర్పులంక ఇండస్ట్రియల్ ఫీడర్ న్యూ ఫీడర్ లైన్ ఎరెక్షన్ నిమిత్తం గుండిపూడి గ్రామమునకు, తుర్పులంక ఆక్వా చెరువు లకు రెల్లుగడ్డ ఆక్వా చెరువులకు ఉదయం 09 గంటల నుండి సాయంత్రం 05 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె రాంబాబు తెలియజేసారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

### అంబేద్కర్‌కు అమలాపురంలో

# అడ్వాన్స్ హ్యాపీ బర్త్ డే విషెస్




**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :** నవభారత నిర్మాత రాజ్యాంగ ప్రదాత భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134 వ. జయంతి ని పురస్కరించుకొని ముందు గానే జయంతి వేడుకలను దళిత సేన గ్రూప్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. కోనసీమ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్.కారెం.రవితేజ విజయ మెడికల్ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్.రత్న బెనర్జీ అంబేద్కర్ గంటా వీళ్ళిద్దరూ కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించి అనంతరం కేకును కట్ చేశారు.దళిత సేన గ్రూప్ సభ్యులు మానసిక వికలాంగుల పిల్లలకు ఎయిర్ కూలర్ నీ బహుమతిగా ఇచ్చారు.మరియు వస్త్ర దానం భోజనాలు ఏర్పాట్లు చేశారు.

### అమరవీరుల స్ఫూర్తితో

# ప్రజా పోరాటాలు కొనసాగిద్దాం

## సిపిఎం ఎటపాక మండల నాయకులు




**ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరవీరుల స్ఫూర్తితో ప్రజా పోరాటాలు కొనసాగిద్దామని సిపిఎం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గోళ్ళగట్ట గ్రామంలో గురువారం పార్టీ మండల కార్యదర్శి కాకా అర్జున్ అధ్యక్షతన అమరజీవి కామ్రేడ్ బండారు సూర్యనారాయణ 33వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభకు ముందుగా స్థానిక శాఖ కార్యదర్శి కామ్రేడ్ బండారు స్టాలిన్ జెండా ఆవిష్కరణ గావించారు. ఈ సందర్భంగా వర్ధంతి సభలో పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ బిబిజి తిలక్ , పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కామ్రేడ్ ఐ.వి , పార్టీ ఎటపాక మండల నాయకులు జి.హరి సభకు హాజరైన ప్రజలనుద్దేశించి ఉత్తేజపరుస్తూ మాట్లాడారు. ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయడం ద్వారా పార్టీని అభివృద్ధి చేద్దాం అని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం భద్రాచలం నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పార్టీ నాయకులు యుండి నర్సారెడ్డి , బండారు శరత్ బాబు , భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి సభకు హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బండారు భరణి కుమారి, పెనుబల్లి భీష్మారావు , బుద్దుల కొండయ్య , జోగయ్య , కల్లూరి వెంకటరావు , నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### అత్యంత ఘనంగా ఐదు రోజుల

# రాములోరి కళ్యాణోత్సవం





**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్యేక పూజల మధ్య శ్రీవారి పుష్పయాగ కార్యక్రమం కనులవిందుగా... అమలాపురం 22 వార్డు గొవ్వల వారి వీధిలో సుమారు 50 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ సీతారాముల ఆలయం వద్ద శ్రీరామనవమి పురస్కరించుకుని ఐదు రోజులపాటు శ్రీరాములవారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆచార్యుల మంత్రొద్యోరణ మధ్య శ్రీ సీతారాములా శ్రీ పుష్ప యాగ కార్యక్రమం కనుల విందుగా జరిగింది. సుమారు 800 నుండి 1500 మంది మహిళ భక్తులు పాల్గొని శ్రీ పుష్ప యోగ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీరామనవమి రోజున స్వామి వారికి కళ్యాణం చేయించిన దంపతులకు వంశోద్ధారకుడు పుట్టడమే కాకుండా కోరుకున్న కోరికలను సైతం స్వామివారు తీరుస్తారని ప్రజల విశ్వాసం... ఐదు రోజులపాటు శ్రీరాముని కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించెందుకు సహకరించిన ప్రజలందరికీ అమలాపురం 22వ వార్డు కౌన్సిలర్ ఆలయకమిటి సభ్యులు గోవ్వాల రాజేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. స్వామివారి శ్రీ పుష్ప యోగ కార్యక్రమం అనంతరం భక్తులకు ఆలయ కమిటీ వారు అల్పాహార విందును ఏర్పాటు చేశారు.

### వైయస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు

# చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

## వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ జొన్నపల్లి సత్తిబాబు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ :** మండపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చేబ్రోలు కిరణ్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ, మండపేట నియోజకవర్గం సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ జొన్నపల్లి సత్తిబాబు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఫిర్యాదు మండపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ కు అందజేశారు.ఈ ఫిర్యాదు నేపథ్యంలో, చేబ్రోలు కిరణ్ అనే వ్యక్తి వైఎస్ భారతిపై సోషల్ మీడియా ద్వారా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వైఎస్ భారతి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సతీమణిగా ప్రసిద్ధి చెందిన వ్యక్తి. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రచారం చేశారు.ఈ విషయం తెలియడంతో, వైసీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. జొన్నపల్లి సత్తిబాబు నేతృత్వంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు మండపేట పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి చేబ్రోలు కిరణ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు సమర్పించారు. ఈ సందర్భంగా వారు పోలీసులకు ఈ వ్యాఖ్యలకు సంబంధించిన ఆధారాలను కూడా అందజేసినట్లు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యాఖ్యలు వ్యాప్తి చెందినందున, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండపేట పట్టణ పార్టీ ప్రెసిడెంట్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు మందపల్లి రవి, పిల్లి శ్రీను, మాజీ కార్పొరేషన్ డైరెక్టర్లు షేక్ అలీఖాన్ బాబా, మీగడ శ్రీనివాసు, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ పెంకే గంగాధరం, వైసిపి నాయకులు యర్రగుంట అయ్యప్ప, పోలమాల సత్తిబాబు, శెట్టి నాగేశ్వరరావు, సాధనాల శివభగవాన్, అడబాల వీరబాబు, సూరంపూడి సత్య ప్రసాదు, కోళ్ల శ్రీను, శీలమంతుల సత్యనారాయణ, గీదుతూరి శివకుమార్, వెల్ల బేబీ కేదార్, కనికెళ్ళ ప్రసాద్, టేకిమూడి శ్రీనివాసు, సన్మాల ధనరాజ్, అప్పాడ రాజు, తణుకు అశోక్, యరమాటి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

### శబరి బెల్టులో మిగిలిన

# 10 గ్రామాలకు వెంటనే ప్యాకేజీ ఇవ్వాలి



**కూనవరం విశ్వంవాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలంలోని రేపాక గ్రామంలో శాఖ సమావేశం మడకం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కార్యదర్శి బాబు బొర్రయ్య మాట్లాడుతూ మండలంలోని శబరి బెల్టు గ్రామాలైనటువంటి 14 గ్రాములకు గాను ఇప్పటిదాకా 4 గ్రామాలకు మాత్రమే 1, బొజ్జరాయి గూడెం 2. ముల్లూరు 3. పెద్దార్కుర్ 4. కొంద్రాజ్ పేట, గ్రామాల వరకే భూమి ప్యాకేజీ ఇచ్చారు,ఇంకా 10 గ్రామాలు భూమి ప్యాకేజీకి నోచుకోలేదు. 2006-2022 సంవత్సరాలలో వచ్చిన వరదలకు మొత్తం గ్రామాలకు గ్రామాలే ముంపన్నకు గురవుతే 41.5 కాంటురులో చేర్చలేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం గాని చూసుకున్నట్లయితే కాపర్ డ్యాం దగ్గర 2022 సంవత్సరంలో 38 మీటర్ల వరదకు ఈ గ్రామాలు మొత్తం ముంపునకు గురైన1. చిన్నారుకూరు 2. బండారి గూడెం 3. రేపాక 4. భగవాన్ పురం 5. కూటూరు 6. అభి చర్ల7. లింగాపురం8. రేగులపాడు9. కోడేరు10. తాళ్ల గూడెం 38 మీటర్లకే మునిగినప్పుడు 41.5 కాంటూరులో చేర్చడానికి ఈ గ్రామాలకు అర్హత లేదా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుడు తడక లెక్కలు చెబుతూ ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ గ్రామాలకు కూడా కాంటురు లెక్కలతో సంబంధం లేకుండా భూమిప్యాకేజీ ఆర్ అండ్ ఆర్ కల్పించాలన్నారు. భూమి ప్యాకేజీ ఇచ్చిన ముల్లూరు గ్రామాన్ని ప్రయారిటీ గ్రామాల జాబితాలో ఎందుకు చేర్చలేదు. మండలంలోని 9 ప్రయారిటీ గ్రామాల నిర్వాసిత యువతీ యువకులకు 2022 సంవత్సరాని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కట్ ఆఫ్ డేట్ ప్రకటించడం సరైనది కాదు. ఏ సంవత్సరంలోనైతే నిర్వాసితులను తరలిస్తారు ఆ సంవత్సరంలో 18 సం:రాలు నిండిన యువతి యువకులకు కూడా కట్ ఆఫ్ డేట్ ప్రకటించాలన్నారు. అదేవిధంగా 4 మండలాలు32 గ్రామాలు ఒకేరోజు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులు ఎలా నిర్వహించగలుగుతారు. సర్వాన్ని త్యాగం చేస్తున్న నిర్వాసితులు తమ సదక బాధకాలు చెప్పుకోవడానికి కూడా పావు గంట టైం ఇస్తే ఆ గ్రామంలో ఉన్నటువంటి నిర్వాసితులు తమ సమస్యలను ఎలా చెప్పుకోగలుగుతారు నిర్వాసితుల మీద ప్రభుత్వ అధికారులు గాని ప్రభుత్వాలు గాని ఎంతటి ప్రేమను చూపిస్తున్నాయి అర్థమవుతుందన్నారు. ఈ సమావేశానికి జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు మండల కమిటీ సభ్యులు తెల్లం తమ్మయ్య మాజీ సర్పంచ్ మడకం బొజ్జి . జోగయ్య సత్యనారాయణ. ధర్మల లక్ష్మణ్ నారాయణ రాజు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రచారంలో మజ్జిక పంపిణి



**చింతూరు డివిజన్ విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక చింతూరు ఐ టి డి ఎ ప్రాంగణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ అధ్యాపకులు, మన్యం కవి నూనె రమేష్ ఏర్పాటు చేసిన చలివేంద్రం లో పర్యావరణ పరిరక్షణకు తీసుకోవల్సిన చర్యలను నూనె రమేష్ వివరిస్తూ ఐ టి డి ఎ కి విచ్చేసిన వివిధ మండలాల ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేస్తూ వివరించారు. ఈ కార్యక్రమం లో పర్యావరణ హితం కొరకు ప్లాస్టిక్ నిర్మూలన చెయ్యాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ పర్యావరణానికి సమాజానికి కలుగ జేచేస్తున్న ప్రమాదాలను వివరిస్తూ ప్లాస్టిక్ పెనుభూతంగా తయ్యారయ్యింది అన్నారు. ప్లాస్టిక్ పర్యావరణ కాలుష్యం,సముద్ర జీవులకు హాని పశువులకు ముప్పు, ఆరోగ్య సమస్యలు వ్యర్థ నిర్వహణ సమస్య,భూమి ఉర్వరత తగ్గింపు వంటి ఇబ్బందులను కలిగిస్తుందాన్నారు. ప్లాస్టిక్‌కు బదులుగా జూట్, కాగితం, ఇలాంటివి వాడాలి.పునర్వినియోగ చేయగల ప్లాస్టిక్ మాత్రమే ఉపయిగించి ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్ ని పూర్తిగా నిషేదించాలి అన్నారు. ఈ కార్యక్రమం లో డిగ్రీ కళాశాల అధ్యాపకులు కట్టా శైలజ, గూడెం హారతి, విద్యార్థులు వేముల చిరంజీవి, గణేష్, మురళి దుర్గ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# టిడిపి పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

## టిడిపి ఎటపాక మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు కణితి మధు



ఎటపాక , విశ్వం వాయిస్ న్యూస్ : మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ బూరుగువాయి తండా గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త జాటోత్ సురేష్ గత కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తెలంగాణ ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్రమంలో గురువారం టిడిపి ఎటపాక మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు కణితి మధు పరామర్శించారు. సురేష్ కు వారి కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ఈ ప్రమాద విషయాన్ని రంప ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి భాస్కర్ కు తెలియజేసి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా జాటోత్ సురేష్ ను ఆదుకునే విధంగా తెలియజేస్తామని అన్నారు. కార్యకర్తలకు ఎప్పుడు తెలుగుదేశం పార్టీ తోడుగా అండగా ఉంటుందని అధైర్య పడొద్దు అని కణితి మధు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.



### చంద్రబాబు,పవన్ కార్మికులకు

# మేనిఫెస్టో హామీనీ మరిచారా

**కార్మికులపై ప్రభుత్వం మొండి వైఖరికి విడనడాలి**

**కార్మికులకు సంక్షేమ బోర్డును పునర్దించాలి..**

**బిల్డింగ్ నిర్మాణంలో చెస్ పేరుతో వసూలు చేస్తున్న సొమ్మును కార్మికులకే చెందాలి**

**భవన నిర్మాణ కార్మికులు కార్మిక శాఖ ద్వారా కార్డు ఉండి మోసపోతున్న కార్మికులు**

**గోకవరం బస్టాండ్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ ఎత్తున నిరసన**

**మే10వతేదీ నుండి కార్మిక శాఖ కార్యాలయాలు ముట్టడి : ప్రెసిడెంట్ బొజ్జ రామకృష్ణ**





**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** కార్మికులపై ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరికి విడనడాలి అని గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ స్టేడ్ యూనియన్ ప్రెసిడెంట్ బొజ్జా రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద,బి.ఆర్ అబేద్కర్ విగ్రహం వద్ద భవన నిర్మాణ కార్మిక పలు సంఘాలు నిరసనగా భారీ ఎత్తున ధర్నా నిర్వచించారు.ఈ సందర్భంగా బొజ్జా రామకృష్ణ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమ బోర్డును పునర్దించాలి, కార్మికుల సహజ మరణం అయితే 2 లక్షల పరిహారం అందజేయాలి, కార్మికుడు ప్రమాదవశాత్తు మరణించిన యెడల 5 లక్షల పరిహారం ఇవ్వాలి, బిల్డింగ్ నిర్మాణంలో చెస్ పేరుతో సొమ్మును వసూలు చేస్తున్న ఆ సొమ్మును కార్మికులకే వర్తింప చేయాలి,కార్మికుల 40 వేల క్లెయిమ్స్ వెంటనే విడుదల చేయాలని, రాజమహేంద్రవరంలో శ్రామిక భవనం పనులు నిలిచిపోయినందున దానిని వెంటనే కార్మికుల పునర్దించి గోడు కల్పించాలని, కార్మికులకు ఈశ్రమ్ పోర్టల్ ను కార్మికులకు అందుబాటులో తీసుకురావాలని, నేషనల్ అకాడమీ కోర్సులో వృత్తిపరమైన ట్రైనింగ్ కోర్స్ ఇచ్చి తద్వారా టూల్స్ కిడ్స్ అందజేయాలని,గత ప్రభుత్వ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి వచ్చిన తరువాత 5 ఏళ్ళు కార్మికులను మోసగించారు. అదేపంథాల్లో ప్రస్తుత ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు 2024 మెన్ఫెస్టో భాగంగా 100 రోజులలో కార్మికులకు న్యాయం చేస్తామని ఉప ముఖ్యమంత్రి కొణెదల పవన్ కళ్యాణ్ కార్మికులకు వరాలు చెప్పినారు. కాని ఇంతవరకు అమలు కాలేదు. అలాగే కార్మిక శాఖ మంత్రి శాసనమండలిలో కోట్ల రూపాయలు ఉన్నాయని చెబుతున్నారు తప్ప ఇంతవరకు అమలులోకి రాలేదు. కావున తక్షణం స్పందించాలని లేని యెడల అవి ఇంతవరకు అమలు కాని కారణంగా రోడ్లపైకి రావడం జరిగినది. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసుకొని మే 1న కార్మికుల దినోత్సవం శుభసందర్భముగా తీపి కబురు చెబుతారని కార్మికులందరూ ఎదురుచూస్తూఉన్నారు. లేనియెడల ఆంధ్రప్రదేశ్లో కార్మిక శాఖను అన్ని విభాగాల కార్మికులు మే10వతేదీ నుండి ముట్టడి చేస్తామని తెలియజేసినారు. నిరసనలో విశ్వకర్మ వడ్రంగి పనివారాల సంఘం ట్రేడ్ యూనియన్, రాజమహేంద్రవరం ప్లంబర్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్, రాజ రాజ నరేంద్ర పెయింటర్స్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్, విఙ్ఞేశ్వర బోర్డు సెంట్రింగ్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్, తాపీ పనివారల సంఘం వర్కర్స్ ట్రేడ్ యూనియన్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

### 14న పిడిఎస్ యు వ్యవస్థాపకులు కామ్రేడ్ జార్జిరెడ్డి

# 53వ వర్ధంతిని విజయవంతం చేయండి

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కిరణ్ కుమార్ పిలుపు... రాజమండ్రిలో పోస్టర్లు అవిస్కరణ**




**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రగతిశీల విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాత, విప్లవ ధృవతార, ఉస్మానియా అరుణతార, న్యూక్లియర్ ఫిజిక్స్లో గోల్డ్మెడలిస్ట్ కామ్రేడ్ జార్జిరెడ్డి అమరత్వం పొంది ఏప్రియల్ 14నాటికి 53 సం.రాలు నిండుతాయి. జార్జిరెడ్డి 53వ వర్ధంతి సందర్భంగా 14 వ తేదీన సభలు, సదస్సులు, ప్రదర్శనలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని పిడియస్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కిరణ్ కుమార్ పిలుపు నిచ్చారు.అయన మాట్లాడుతూ కా.జార్జిరెడ్డి 1947 జనవరి 15న కేరళలోని పాలాట్లో జన్మించారు. తండ్రి రఘునాధరెడ్డి చిత్తూరుజిల్లా, చల్లావారిపల్లి గ్రామం. తల్లి లీల కేరళకు చెందినవారు. జార్జిరెడ్డికి అన్నయ్య, అక్కతమ్ముడు, చెల్లెలుఉన్నారు. కేరళ, తమిళనాడు, వరంగల్, హైదరాబాద్లలో జార్జివిద్యాభ్యాసం చేశారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. 1967సం. ఉస్మానియా యూనివర్శిటీలో అణుభౌతిక శాస్త్రం (న్యూక్లియర్ ఫిజిక్స్) లో చేరే నాటికి క్యాంపస్ అంతా ర్యాగింగ్ పేరుతో నూతన విద్యార్థులను మానసికంగా చిత్రహింసలకు గురి చేసేవారు. విద్యార్థినుల విద్యార్థిన పట్ల అసభ్యంగా ప్రవర్తించేవారు. పేద విద్యార్థులను హీనంగా చూసేవారు. విద్యార్థుల జేబుల్లోని డబ్బులను బహిరంగంగా స్వాహా చేసేవారు. సంవత్సరాల తరబడి క్యాంపస్లో ఏబీవీపీ తిష్టవేసి హాస్టల్ను కబ్జా చేసి విద్యార్థుల సౌకర్యాలను వారే అనుభవించేవారు.చివరకు ప్రభుత్వ ఉద్యోగస్తులపై తమ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ దాడులు చేసేవారు. ఈ అరాచక శక్తులకువ్యతిరేకంగా, విద్యార్థులకు అండగా కామ్రేడ్ జార్జిరెడ్డి నిలబడ్డాడు. క్యాంపస్ అన్యాయాలపై, అక్రమాలపై సమరశంఖం పూరించాడు. విద్యార్థులను చైతన్యవంతం చేశాడు. జరుగుచున్న అన్యాయాలపైన మతోన్మాధ శక్తులపైన, గుండాల గుండెల్లో రైళ్ళు పరిగెత్తించాడు. యూనివర్శిటీ విద్యార్థులకు జార్జిరెడ్డి ఒక హీరో, రోల్మాడల్ అయ్యాడు.కామ్రేడ్ జార్జిరెడ్డి మేధస్సుకు బోధనో పాధ్యాయులే ఆశ్చర్యచకితులయ్యేవారు. సైన్స్ విద్యార్థిగా ఉంటూ చరిత్రను అధ్యయనం చేశాడు. న్యూక్లియర్ ఫిజిక్స్లో గోల్డ్ మెడల్ సాధించాడు. నగ్జల్బరీ, శ్రీకాకుళ సాయుధపోరాటాలతో ప్రభావితుడై శాస్త్రీయదృష్టిని అలవరచుకొన్నాడు. క్యూబా విప్లవకారుడు చేగువేరా సాహసకృత్యాలప్రభావం జార్జిపై మెండుగా పడింది. క్రమంగా శాస్త్రీయ సోషలిజం గురించి అధ్యయనం చేశాడు. భారతదేశ పీడిత ప్రజలకు నూతన ప్రజాస్వామిక విప్లవమొక్కటే శరణ్యమని విశ్వసించాడు. దేశంలో పెరిగిపోతున్ననిరుద్యోగం, దారిద్ర్యం, దోపిడి, అక్రమాలు, అవినీతి, అధికధరలు జార్జిని ప్రకోపితుణ్ని చేశాయి. పీడితప్రజలకు ఉపయోగపడని చదువులను అసహ్యించుకొన్నాడు. సమాజానికి సేవ చేసేదే నిజమైన విద్య అని భావించాడు. తన మేధాశక్తిని గుర్తించి ఎన్నోసార్లు ఉన్నతోద్యోగాలకు ఆహ్వానాలు వచ్చినా వాటన్నింటిని తిరస్కరించి విద్యార్థిలోకాన్ని చైతన్యవంతం చేయడానికి ప్రగతిశీల విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణానికి పూనుకొన్నాడు. ఆర్.యస్.యస్., ఏ.బి.వి.పి. మతోన్మాదు లకు, పాలకులకు అనతికాలం లోనే సింహ స్వప్నమైనాడు. జార్జి నిత్యంవ్యాయామంతో పాటు, బాక్సింగ్ చేయడం ద్వారా అనేక మూకదాడులను తిప్పికొట్టడం జరిగింది. 1971సం.ఎలో క్యాంపస్లో జరిగిన ఎన్నికల్లో ప్రగతిశీల విద్యార్థులు విజయం సాధించడంతో మతోన్మాధ గూండామూకలు మరింత రెచ్చిపోయాయి. మతోన్మాధానికి కండ్లు కనిపించవు. విచక్షణ ఉండదు. పైశాచికత్వం దాని క్రీడ, దౌర్జన్యం దాని ఊపిరి. అన్నట్లుగా కామ్రేడ్ జర్జిరెడ్డిని టార్గెట్చేసి 1972 ఏప్రియల్ 14న పధకం ప్రకారం ఏ.బి.వి.పి., ఆర్.యస్.యస్. దూల్పేట గూండాలు కలిసి కత్తులతో పొడిచి హత్య చేశారు. మరణించే నాటికి జార్జిరెడ్డి వయస్సు 25 సం.రాలే. వీరుని మరణం కన్నీరు తెప్పించదు. కర్తవ్యాన్ని గుర్తుచేస్తుంది. జార్జి మరణంతో ప్రగతిశీల విప్లవ విద్యార్థి ఉద్యమంనా శనంకాలేదు, సరికదా రాష్ట్రవాప్త ఉద్యమసంస్థగా పి.డి.యస్.యు. ఉద్భవించింది. జార్జి మరణం తర్వాత ఓ.యు ఇంజనీ రింగ్ కళాశాల విద్యార్థి జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతా తిరిగి పి.డి.యస్.యు ని బలోపేతం చేశాడు. 1975 ఎమర్జీన్సీ కాలంలో కామ్రేడ్స్ జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ను రాజ్యం కాల్చిచంపింది. కామ్రేడ్ శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్, చేరాలు, రంగవల్లి, వరహాలు, సాంబయ్య వంటి అనేక మంది పి.డి.యస్.యు విప్లవ విద్యార్థి ఉద్యమంలో అమరులైనారు. వారిఆశయాలను కొనసా గించాల్సిన కర్తవ్యం నేటి విద్యార్థి లోకంపై ఉన్నది. విజ్ఞాన కేంద్రాలుగావిరిసిల్లవలసినయూనివర్శిటీలను మోదీ ప్రభుత్వం భ్రష్టు పటిస్తుంది. అగ్రకుల, ఆగ్రహారాలుగా మారుస్తుంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో రోహిత్ వేముల మొదలుకొని బాంబే ఐఐటిలో దర్శన్ సోలంకి వరకు కులోన్మాధ హత్యల పరంపర కొనసాగు తున్నది. విద్యారంగాన్ని మనువాద భావజాలంతో నింపు తున్నారు. హిందూ ఫాసిస్టు దాడులు పెచ్చరిల్లుతున్నాయి. ఈ దుశ్చర్యలను తిప్పికొట్టాలి. శాస్త్రీయ విద్యా సాధన కోసం విద్యార్థులంతా ఐక్యంగా ఉద్యమించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాడాలి. కార్యక్రమంలో కె.భాను ప్రసాద్ పిడిఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు. రాజమండ్రి నగర కార్యదర్శి వి.ధినేష్ బాబు, నాయకులు రోహిత్, శ్రీను, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు

### కార్పొరేషన్ ఎన్నికలకు కాంగ్రెస్‌ను

# నగరంలో బలోపేతం చేస్తాం

**అన్నివార్డుల్లోను పాదయాత్రలు... వార్డు కమిటీలు వేస్తాం**

**కూటమి ప్రభుత్వం సూపర సిక్స్ పథకాలు అమలు చేయాలి**

**కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, జిల్లా కాంగ్రెస్ ఇన్చార్జి డాక్టర్ వడయార్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న 2027 పుష్కరాల దృష్ట్యా రాజమండ్రి నగరంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ చేపడుతున్నామని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, జిల్లా కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ తాత్కాలిక ఇన్చార్జి డాక్టర్ వడయార్ చెప్పారు.మున్సిపల్ కాలనీలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ నగరంలోని 50 వార్డుల్లో పాదయాత్ర చేసి కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతామని ,వార్డు కమిటీలు వేస్తామని చెప్పారు.ఆతర్వాత నగర కమిటీ పూర్తి స్థాయిలో వేస్తామని మార్టిన్ లూథర్ చెప్పారు.కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చూపిస్తామని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలు గడిచినా సూపర్ సిక్స్ పథకాలు పూర్తిగా అమలు చేయడం లేదని మార్టిన్ లూథర్ విమర్శించారు.తల్లికి వందనం,యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్ సదుపాయం,మహిళలకు సంవత్సరానికి రూ.20 వేలు,ఆడపిల్లకు నెలకు రూ.1500 ఇవ్వడం వంటి హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు.పేదలకు సంజీవని లాంటి ఆరోగ్యశ్రీ సక్రమంగా అమలు చేయాలని, ఆసుపత్రులకు రూ.3,500 కోట్లు బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మార్టిన్ లూథర్ డిమాండ్ చేశారు.డాక్టర్ వడయార్ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తామని, కార్యకర్తలు నాయకులు సైనికులమాదిరి పని చేసి రాజమండ్రి నగరపాలక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్పొరేటర్లను గెలిపించుకుంటామని చెప్పారు.నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్లా షరీఫ్, ప్రధాన కార్యదర్శి పట్నాల శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు బెజవాడ రంగారావు, అసంఘటిత కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకర్ గౌడ్, తదితరులు ప్రసంగించారు.విలేకరుల సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోత శారద, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బత్తిన చంద్రరావు,నల్లా వీర్రాజు, పీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం రవి, నగర ఉపాధ్యక్షుడు దేవత సుధాకర్,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.ఏసు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే బలరామకృష్ణతో కలిసి వివిధ రహదారులకు శంకుస్థాపన చేసిన

# పెందుర్తి అభిరామ్



**సీతానగరం, విశ్వంవాయిస్ న్యూస్:** రాజానగరం నియోజకవర్గంలో సీతానగరం మండలాల్లో పలు గ్రామాల్లో నూతన రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. రాజానగరం తెలుగుదేశం పార్టీ టిడిపి యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తో కలిసి పెందుర్తి అభిరామ్ రఘుదేవపురం, సీతానగరం డిగ్రీ కళాశాల ఎదురుగా రామచంద్రపురం, ఏటిగట్టు మీద ఏర్పాటు చేసిన శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రహదారుల నిర్మాణం వలన ఆయా గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం విరుగుపడుతుందని రాష్ట్రప్రభుత్వం వ్యక్తం చేశారు అభివృద్ధి పనులకు తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రహదారుల నిర్మాణం ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

### రాజమండ్రిలో హెూం స్టూడియో ఫర్నిచర్

# షోరూం ఘనంగా ప్రారంభం

**అత్యాధునికమైన మోడల్స్ తో నాణ్యమైన ఫర్నిచర్ మా ప్రత్యేకత**

**సరసమైన ధరలకు అన్ని రకాల గృహెూపకరణలో లభించును**

**హెూంస్టూడియో షోరూం ప్రోపరేటర్ యశ్వంత్ సూర్యనారాయణ**







**రాజమహేంద్రవరం,విశ్వంవాయిస్ న్యూస్ :** నాణ్యమైన అత్యాధునికమైన మోడల్స్ తో హెూమ్ ఫర్నిచర్ మా షాపులో లభిస్తుందని హెూం స్టూడియో షోరూం ప్రోపరేటర్ యశ్వంత్ సూర్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం ఎన్ హెచ్ 16, గారపాటి గార్డెన్స్, పద్మావతి నగర్, ఓఎన్జిసి గోల్ఫ్ గేట్ ప్రక్కన హెూం స్టూడియో ఫర్నిచర్ షోరూం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూం అధినేత యశ్వంత్ సూర్యనారాయణ, ప్రోపరేటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ వినియోగదారులకు అభిరుచుల మేరకు గృహెూపకరణాలు అందిస్తున్నామని తెలిపారు. మావద్ద సోఫాలు, డబల్ కాట్ బెడ్స్, కుర్చీలు, టీ పాయి, వివిధ రకాల గృహ వినియోగ వస్తువులు లభిస్తాయని తెలిపారు. వినియోగదారులకు కోరిక మేరకు వారికి కావలసిన సైజులలో వారికి కావలసిన మోడల్స్ లో ఆర్డర్లపై తయారుచేసి అందిస్తామని అన్నారు.ఆంధ్రప్రదేశ్లో ఎక్కడికైనా గృహ ఉపకరణాలు వినియోగదారుల ఆర్డర్ మేరకు వారి ఇంటికే ఉచితంగా సప్లై చేస్తామని వివరించారు.తమ షోరూమ్ కు బొంబాయి లో వర్క్ షాప్ ఉందని తెలిపారు. అక్కడ నుంచి తయారు చేయబడిన వివిధ మోడల్స్ లలో నాణ్యమైన టేకు, రోజ్ ఉడ్,తదితర కలప తో తయారు చేయబడిన వస్తువులను సరఫరా చేస్తామని అన్నారు. తాము అందిస్తున్న ఆధునికమైన మోడల్స్ ఫర్నిచర్ వస్తువులను తక్కువ ధరలకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదుపాయాన్ని యావన్మంది వినియోగదారులు వినియోగించుకొని మీ గృహంలో నాణ్యమైన ఫర్నిచర్ వస్తువులు వినియోగించుకోవాలని సూచించారు.

# జననీలో ముద్రగడ సుధాకర్ పుట్టినరోజు వేడుక




**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్ :** కడియం మండలం దామిరెడ్డిపల్లి గ్రామ వాస్తవ్యులు ముద్రగడ సుధాకర్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ జనని మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాల నందు గురువారం అడ్వకేట్ యినుమర్తి ప్రభాత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లు, రొట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు భోజనాలను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, గంధం వీరబాబు,దూళ్ల ప్రసాద్, లంక సత్తిబాబు,రుద్ర గణేష్, సురేంద్ర, రాము, గణేష్, అంజి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వైఎస్ఆర్సిపి మహిళా విభాగం అధ్యక్షురాలుగా మార్తి లక్ష్మీ నియామకం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైయస్సార్ పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, రాజమండ్రి సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మార్తి లక్ష్మి ని వైయస్సార్సీపి తూర్పు గోదావరి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమించడమై నది అని వైఎస్ఆర్సిపి పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మార్తి లక్ష్మీ నియామకం పట్ల పలువురు నేతలు ఆమెకు అభినందనలు తెలిపారు.







## జీ తెలుగులో డ్రామా జూనియర్స్
# సీజన్-8 ప్రారంభం


**అనిల్ రావిపూడి, రోజా న్యాయనిర్ణేతలుగా ఈ శనివారం రాత్రి 9 గంటలకు**

**ప్రతిభ గల చిన్నారులను మరింత ప్రోత్సాహం**




**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తెలుగు ప్రేక్షకులకు ఎప్పటికప్పుడు సరికొత్త కార్యక్రమాలని అందిస్తూ వినోదం పంచుతున్న ఛానల్ జీ తెలుగు. చిన్నారుల్లోని ప్రతిభను వెలికితీస్తూ ప్రేక్షకాదరణతో విజయవంతంగా 7సీజన్లు పూర్తి చేసుకున్న జీ తెలుగు డ్రామా జూనియర్స్ కొత్త సీజన్ 8 ఏప్రిల్ 12న, ప్రారంభం కానుంది..ప్రతి శనివారం రాత్రి 9 గంటలకు, మీ జీ తెలుగులో! సంవత్సరాల నుంచి ప్రేక్షకులు హృదయాలను గెలుచుకున్న డ్రామా జూనియర్స్ 8వ సీజన్‌తో మరోసారి ప్రేక్షకులకు వినోదం పంచేందుకు సిద్ధమైంది. తెలంగాణ మరియు ఆంధ్ర ప్రదేశ్‌లోని పిల్లల్లో దాగున్న నటనా ప్రతిభను వెలికి తీసే ఉద్దేశ్యంతో కొత్త సీజన్ని ప్రారంభిస్తోంది. ఈ షో ను ఎవర్గ్రీన్ ఎనర్జిటిక్ యాంకర్ సుధీర్ హోస్ట్ చేయనున్నారు. పిల్లల స్కిట్లకీ, సుధీర్ కామెడీ పంచులు, టైమింగ్ తోడైతే ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వడం ఖాయం. ప్రతిభ గల చిన్నారులను మరింత ప్రోత్సహించి వారిని ఆశీర్వదించేందుకు ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి, నటి రోజా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. వరుస హిట్ సినిమాలతో సక్సెస్ఫుల్ డైరెక్టర్ గా రాణిస్తున్న అనిల్ రావిపుడి జీ తెలుగు డ్రామా జూనియర్స్ 8 షో ద్వారా బుల్లితెరపై మొదటిసారిగా న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తూ చిన్నారుల బంగారు భవిష్యత్తుకు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. ఇక, డ్రామా జూనియర్స్ సీజన్ 8 గ్రాండ్ లాంచ్ ఎపిసోడ్ ముఖ్య అతిథులుగా ప్రముఖ నటులు జగపతి బాబు, ఆమని హాజరై చిన్నారుల్లో మరింత ఉత్సాహం నింపనున్నారు. వీళ్ళ నటనా ప్రతిభ కనబరిచే అద్భుతమైన ప్రదర్శనలు, సరదా సంభాషణలతో డ్రామా జూనియర్స్ సీజన్ 8 ఘనంగా ప్రారంభం కానుంది.


## పెనుగొండ రవికుమార్‌కు
# జాతీయ ప్రతిభా అవార్డు



**వేంపల్లె, విశ్వంవాయిస్ న్యూస్ :** మండలంలోని ఇడుపుల పాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్ లో పని చేస్తున్న పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవి కుమార్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు సౌత్ రన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి నాగయ్య తెలిపారు. జమ్మలమడుగు పట్టణానికి చెందిన డాక్టర్ పెనుగొండ రవికుమార్ 12సంవత్సరాల నుండి ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, పరిపాలన అధికారిగా అంకితభావంతో క్రియాశీలకంగా పనిచేస్తూ ట్రిపుల్ఐటీ అభివృద్ధికి పాటుపడుతున్నాడు. అలాగే అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన జపాన్ లోని ఏఐజెడ్ యు యూనివర్సిటీలో పరిశోధనలు చేసి సాహిత్యం, విద్య, సామాజిక సేవా రంగంలో విశేషమైన కృషి చేసినందుకు గాను ఆయన చేసిన విలువైన సేవలను గౌరవిస్తూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సంద ర్భంగా ఈ అవా ర్డుకు డాక్టర్ పెను గొండ రవికుమార్ ను ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఈనెల 13న గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ పురస్కారంను రవికుమార్ కు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. పరిపాలన అధికారి డా రవికుమార్ కు ప్రతిభా అవార్డు రావడంతో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, రిజిస్టార్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సంద్ర, వైస్ ఛాన్సలర్ విజయ్ కుమార్ అభినందనలు తెలియజేసారు.

# ఆప్కాస్ ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సు పెంచాలి



**కడప, విశ్వంవాయిస్ న్యూస్ :** కడప కార్పొరేషన్ లో పనిచేస్తున్న ఆప్కాస్ ఉద్యోగులను వయస్సు రీత్యా తొలగించడం వలన వారి కుటుంబాలు రోడ్డు పాలు అవుతున్నాయని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, కోశాధికారి గోపి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పర్మినెంట్ ఉద్యోగులకు 62 సంవత్సరాలు పెట్టి, లక్షల రూపాయలు జీతం ఇస్తూ ఉన్నారని పేర్కొన్నారు. వారితో సమానంగా పనిచేస్తున్న ఆప్కాస్ ఉద్యోగులకు రూ.15వేలు వేతనం ఇస్తూ 60 సంవత్సరాలకే పరిమితి చేయడం దారుణమని చెప్పారు. 1990 నుంచి రూ.800 వేతనం తో పంచాయతీ నుంచి మున్సిపాలిటీ, కార్పొరేషన్ వరకు ప్రజలకు సేవ చేస్తున్నారని తెలిపారు. ప్రజా సేవ చేస్తున్న కుటుంబాలను ఆదుకోవాలని పేర్కొన్నారు. అంబేద్కర్ వారోత్సవాలు అని లక్షలు ఖర్చు చేస్తున్నారని, 35 నుంచి 40 సంవత్సరాలు పని చేసి వారి కుటుంబం జీవనం కొనసాగించడం కోసం కాలి చేతులతో వెళ్లకుండా వారికి రిటైర్ మెంట్ బెనిఫిట్స్ రూ.3 లక్షలు కార్పొరేషన్ ద్వారా లేదా ప్రభుత్వం ద్వారా ఇవ్వాలని కోరారు. ప్రభుత్వానికి తమ ద్వారా సిఫార్సు చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జివో నంబర్ 36 ప్రకారం రూ.24,500 ఇవ్వడానికి ఆర్థిక శాఖలో పెండ్డింగ్ జివో నంబర్ 36ను ప్రభుత్వం విడుదల చెయ్యాలని పేర్కొన్నారు.

## చిక్కాల వారి వివాహ వేడుకలో
# పాల్గొన్న బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం విశ్వంవాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం ఇనుగంటివారిపేట గ్రామంలో ద్వారకామాయి ఫంక్షన్ హాల్ నందు ఘనంగా జరిగిన చిక్కాల వారి వివాహ వేడుకకు చిక్కాల దేవానంద్ ఆహ్వానం మేరకు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి వివాహ వేడుకలో పాల్గొని నూతన వరుడు ప్రసాద్ ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'క్యూబా' సంఘీభావ
# విరాళాల సేకరణ



**చీమకుర్తి, విశ్వంవాయిస్ న్యూస్ :** అమెరికా సామ్రాజ్యవాదానికి తలొగ్గ కుండా కార్మిక, కర్షక రక్షణ కోసం నికరంగా నిలబడిన క్యూబా ప్రభుత్వానికి ప్రజలు అన్ని విధాలా సంఘీభావం తెలపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం మండలంలోని మరి చెట్ల పాలెం సెంటర్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో క్యూబా సంఘీభావనిధి సేకరణ కార్యక్రమంలో నిర్వహించారు. సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ సామ్రాజ్యవాద దేశమైన అమెరికా నిరంతరం క్యూబా దేశాన్ని తన గుప్పెట్లో పెట్టుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను ఎదుర్కొంటూ ఆ దేశ ప్రజలు వీరోచితంగా నిలబడుతున్న తీరు ప్రజాస్వామ్యవాదులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. ప్రజల నుంచి సేకరించిన నిధులను రాష్ట్ర కేంద్రానికి పంపి క్యూబా దేశానికి మందులు, గోధుమలు, సామగ్రి పంపుతామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి కంకణాల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు గంగుల చెన్నకేశవులు, నుగ్గు శ్రీను, మోత శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో డ్రైవింగ్
# ఆగి ఉన్న కారును ఢీకొన్న ఆటో




**తెనాలి, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఆగి ఉన్న కారును ఢీకొట్టాడు. ప్రమాదంలో కారు వెనుక భాగం పూర్తిగా దెబ్బతినగా, ఆటో కూడా దెబ్బతింది. అయితే వాహనాల్లో ప్రయాణిస్తున్న వారికి మాత్రం స్వల్ప గాయాలు మినహా ప్రమాదం ఏమీ లేదు. సేకరించిన వివరాల ప్రకారం ఒంగోలు నుంచి తెనాలి ఆటోనగర్ వెళుతున్న కారు ఆటోనగర్ సమీపంలో రోడ్డు మార్జిన్ లో ఆగి ఉంది. అదే సమయంలో తెనాలి నుంచి కంఠంరాజు కొండూరుకు కూరగాయల లోడుతో వెళుతున్న ఆటో వెనుక నుంచి బలంగా కారును ఢీ కొట్టింది. ఆటో డ్రైవర్ షేక్ బాజీ మద్యం మత్తులో ఆటో నడుపుతున్నాడని, ఆటోలో మద్యం సేవిస్తున్న గ్లాసు, తినడానికి ఉంచుకున్న సపోటాలు, సిగరెట్ పెట్టె ఉన్నాయని, ఆటో నడుపుతూనే మద్యం సేవిస్తున్నట్లు ఆటోలో ఉన్న ప్రయాణికుడు చెప్తున్నాడు. బాధితులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

## 39వ డివిజన్లో
# అభివృద్ధి పనులు పరిశీలన

**వార్డుల్లో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి**

**లింగంపేట వాంబే గృహాలకు మా కుటుంబం ఎంతో సేవలు చేసింది : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** నగరంలో మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, మళ్ళీ ఎక్కడైనా బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ లు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. గురువారం 39వ వార్డులో అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ మీ భద్రత మా బాధ్యత కార్యక్రమం ద్వారా బ్లేడ్ బ్యాచ్ గంజాయి బ్యాచ్ లను అణచివేశామని, మళ్ళీ వారి గురించి మహిళలు చెబుతున్నారని, పోలీసులకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. నగరంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని, రోడ్లు, కాలువల గురించి అడగక ముందే వాటిని నిర్మిస్తున్నామని ఆయన చెప్పారు. లింగం పేట, ఆదెమ్మ దిబ్బ వాంబే గృహాల ప్రాంతంలో మేజర్ డ్రైనేజీ పూర్తవుతోందని ఆయన చెప్పారు. వర్షా కాలంలో ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు చేపట్టారని ఆయన అన్నారు. లింగంపేట వాంబే గృహాలకు తమ కుటుంబం చేసిన సేవలు ఎవరూ చేయలేదని, మేయరుగా తన తల్లి, ఎమ్మెల్సీగా తన తండ్రి ఆదిరెడ్డి అప్పారావు, ఎమ్మెల్యేగా తన సతీమణి ఆదిరెడ్డి భవాని, ఇప్పుడు ఎమ్మెల్యేగా తాను సేవలు, సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఆయన నవ్వుతూ చెప్పారు. నగరంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

## మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేసిన
# వ్యక్తి డా.హిప్నోకమలాకర్

**మానసిక వైద్య నిపుణులు డాక్టర్.ఆర్.హరికుమార్**



**చిక్కడపల్లి, విశ్వంవాయిస్ న్యూస్ :** మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేసిన వ్యక్తి డా.హిప్నోకమలాకర్ అని మానసిక వైద్య నిపుణులు డాక్టర్.రవ్వ హరి కుమార్ అన్నారు. ఏప్రిల్ 10వ తేదీన డా.హిప్నో కమలాకర్ జయంతి వేడుకలను ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ,నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ కాలేజీ హాస్టల్లో అమ్మాయిలు మూఢనమ్మకాలు పై పోటీలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానవ మనస్సు సరికొత్త ఆవిష్కరణలకూ, విజ్ఞానానికి బీజమని చెప్పారు. కానీ కొన్ని మూఢనమ్మకాలు మాత్రం ఈ ఎదుగుదలకు అడుగడుగునా అడ్డు తగులుతున్నాయి ఆవేదన వ్యక్తంచేశారు. తప్పుడు నమ్మకాలను కూల్చి, సైన్సు, తర్క, విజ్ఞానం పట్ల ప్రజల్లో అవగాహన పెంచడానికి జీవితాన్ని అంకితమిచ్చిన వ్యక్తి డా. హిప్నో కమలాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలు, స్నాక్స్, అన్నదానము డా.హరి కుమార్, జి.కృష్ణవేణి, సంఘం తెలంగాణా అధ్యక్షుడు సాగర్ల రఘు, రమణా, లయన్ జయశ్రీ, వసతి గృహం హెడ్ ఎ.అనసుయా పంచడం జరిగింది. సంఘం తెలంగాణా అధ్యక్షుడు సాగర్ల రఘు మాట్లాడుతూ మూఢనమ్మకాలకు బాలికా కుండా విజ్ఞానాన్ని వెలిగించాలని తపనపడిన వ్యక్తి కమలాకర్ అన్నారు. లయన్ జి.కృష్ణ వేణి మాట్లాడుతూ మూఢనమ్మకాలు, సమాజాభివృద్ధికి అవరోధ మౌఢ్యమని,వ్యక్తిత్వ వికాసానికి ఆటంకాలని తెలియజేసిన వ్యక్తి కమలాకర్ అన్నారు. డా.హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ ప్రశ్నించడం, పరిశీలించడం, పరీక్షించడం లేని వ్యక్తి అంధవిశ్వాసాలకి బలవుతాడని తెలిపారు .ఏ విషయాన్నయినా శాస్త్రీయ దృక్పథంలో ఆలోచించాలని సూచించారు. అప్పుడే వ్యక్తిత్వ వికాసం, సమాజ ప్రగతి సాధ్యమని నిరూపించిన డా.హిప్నోకమలాకర్ ఎంతో అభినందనీయుడని చెప్పారు. చదువుకున్న వాళ్ళే మూఢంగా నమ్మేయడంతో సామాన్యవ్యక్తి ఇక ఏమాత్రం ప్రశ్నించకుండా వాటిని అనుసరించడం జరుగుతుందన్నారు. ప్రజలలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించిన కొద్దీ మూఢనమ్మకాలు తొలగిపోతాయన్నారు. అడ్వకేట్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూఢనమ్మకాలని ఖండించాలంటే గుండెధైర్యం ఉండాలి. విజ్ఞాన విషయాలని వివరించి, శాస్త్రీయ దృక్పధం కలిగించే నేర్పు ఉండాలి. అంతకంటే ఆ వ్యక్తిలో అంకిత భావం ఉండాలి. శాస్త్రీయ పంథాలో ముందుకు సాగుతూండాలి. మౌఢ్యానికి ఎక్కడా తల వంచకుండా ఉండాలి. డా. హిప్నో కమలాకర్ అటువంటి వ్యక్తి కావటం వల్లే 20,000 వెల హిప్నాటిజం ప్రోగ్రామ్స్,100 పుస్తకాలు రాయడం ఆయనకే సాధ్యమైందన్నారు. నిజాన్ని నిర్భయంగా చెప్పేవారు న్నారు. విద్యార్థులు తార్కిక ఆలోచన, సైన్సు పట్ల ప్రేమ కలిగే విధంగా ఈ అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమైనవన్నారు. "మూఢనమ్మకాలు తొలగితే విద్యార్థులు అభివృద్ధి వైపు పయనిస్తారన్నారు.

# పూరి డైరెక్షన్‌లో టబు

సినీ వాయిస్ CINEMA



పూరి జగన్నాథ్ ఒకప్పుడు టాలీవుడ్‌లో పవర్ఫుల్ కథలతో సంచలనాలు సృష్టించిన డైరెక్టర్. ఇడియట్, పోకిరి, టెంపర్, బిజినెస్ మాన్ లాంటి హిట్లు ఇచ్చిన పురికి ఇప్పుడు లోకల్ గా అంతగా కలిసి రావడం లేదు. లేటెస్ట్‌గా వరుస పరాజయాలతో పూరి కెరీర్ క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్లింది. 'లైగర్', 'డబుల్ ఇస్మార్ట్' వంటి సినిమాలు భారీ డిజాస్టర్ అయ్యాయి. అలాంటి టైంలో పూరి తిరిగి తన సత్తా చూపించేందుకు మళ్లీ గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. ఇప్పుడు పూరి చేస్తున్న కొత్త సినిమా కొంచెం డిఫరెంట్ అండ్ డేరింగ్ గా మారుతోంది. ఈ ప్రాజెక్ట్‌లో ప్రముఖ తమిళ నటుడు విజయ్ సేతుపతి హీరోగా నటించనున్నాడు. విలక్షణ నటనకు కేరాఫ్ అడ్రస్ అయిన సేతుపతి ఇలా తెలుగు దర్శకుడితో చేయడమంటే మామూలు విషయం కాదు. సాధారణంగా ఆయనకు కథ నచ్చితేనే ఒప్పుకుంటాడు. పైగా రెమ్యునరేషన్ గురించి అస్సలు పట్టించుకోని వ్యక్తి. కథ ఎంత బలంగా ఉంటే.. ఎంత డిఫరెంట్‌గా ఉంటే.. అంత తక్కువలో కూడా ఒప్పుకునే నమ్మకాన్ని ఆయన కలిగిస్తారు. మరోవైపు ఈ సినిమాలో కీలక పాత్రకు టబు కూడా సైన్ చేసినట్లు అఫీషియల్ క్లారిటీ వచ్చేసింది. బాలీవుడ్‌లోనే కాకుండా పాన్ ఇండియా లెవెల్‌లో టబుకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. టబు ఇటీవలి కాలంలో ఏడాదికి కేవలం ఒకటి లేదా రెండు పాత్రలకే ఓకే చెబుతోంది. కథ నచ్చకపోతే ఎక్కడి నుండి వచ్చిన ప్రాజెక్ట్ అయినా రిజెక్ట్ చేస్తుంది. ఇప్పుడు ఆమె పూరి ప్రాజెక్ట్‌లో నెగటివ్ షేడ్స్ ఉన్న డైనమిక్ రోల్ చేయబోతుందని సమాచారం. అంటే పూరి స్క్రిప్ట్ మామూలుగా ఉండదని అర్థమవుతుంది. ముఖ్యంగా ఇప్పుడు పూరి స్థానిక హీరోలను కూడా ఒప్పించలేని పరిస్థితిలో ఉండగా, ఈ స్థాయి నటీనటులను ఎంపిక చేయడం వెనక ఆయన దగ్గర బలమైన కంటెంట్, క్రేజీ స్క్రీన్ ప్లే ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# అఖండ 2.. అంతా సజావుగా సాగుతోందా?




నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబోలో ఇప్పటి వరకు వచ్చిన 'సింహా', 'లెజెండ్', 'అఖండ' సినిమాలు భారీ విజయాన్నిసొంతం చేసుకున్నాయి. ముఖ్యంగా అఖండ సినిమా అత్యధిక వసూళ్లు సాధించింది. తెలుగులో మాత్రమే కాకుండా హిందీలోనూ అఖండ ఆకట్టుకుంది. థియేట్రికల్ రిలీజ్‌లో కంటే ఓటీటీలో అఖండ కి మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు అఖండ 2 సినిమా రూపొందుతోంది. బాలకృష్ణ, బోయపాటి కాంబోలో రాబోతున్న నాల్గవ సినిమా అఖండ 2. ఇప్పటి వరకు సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. చివరి రెండు షెడ్యూల్స్ షూటింగ్ మాత్రమే బ్యాలెన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఒక షెడ్యూల్ సందర్భంగా బాలకృష్ణ, బోయపాటి శ్రీను మధ్య చిన్న విషయంలో గొడవ జరిగిందని, ఇద్దరి మధ్య ప్రస్తుతం మాటలు లేవు అంటూ పుకార్లు షికార్లు చేస్తున్నాయి. అయితే ఆ పుకార్లు పూర్తిగా అవాస్తవం. బాలకృష్ణ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దర్శకుడికి పూర్తిగా సరెండర్ అయ్యి సినిమాను చేసే హీరో. పైగా తనకు మూడు హిట్స్ ఇచ్చిన దర్శకుడు కావడంతో బోయపాటి శ్రీను విషయంలో కచ్చితంగా బాలకృష్ణ కు ఎలాంటి అనుమానం ఉండదు. బాలకృష్ణ దర్శకుడు ఏం చెబితే అది చేసేందుకు రెడీగా ఉంటాడు. ఒక సారి కథ విని, స్క్రిప్ట్ ఫైనల్ అయిన తర్వాత కొందరు హీరోలు ఇన్వాల్వ్ అవుతారని, వేలు పెడతారని టాక్ వింటూ ఉంటాం. గతంలో ఎప్పుడూ ఇలాంటి పుకార్లు బాలకృష్ణ గురించి రాలేదు. మొదటి సారి ఇలాంటి పుకార్లు రావడం తో కొందరు ఫ్యాన్స్ సైతం ఈ విషయమై ఆలోచనలో పడ్డారు. కొందరు ఫ్యాన్స్ మాత్రం పుకార్లను కొట్టి పారేశారు. బాలకృష్ణ 2025 సంక్రాంతికి 'డాకు మహారాజ్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. ఆ సినిమాకి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. అఖండ సినిమాతో విజయాన్ని సొంతం చేసుకుని, ఆ తర్వాత వీర సింహారెడ్డి, భగవంత్ కేసరి, డాకు మహారాజ్ సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ విజయాలను సొంతం చేసుకున్నాడు. డాకు మహారాజ్ సినిమా కొన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ నమోదు చేయలేదనే టాక్ వినిపిస్తుంది.

# మళ్లీ 'కుభేర' త్రయం!



కోలీవుడ్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల 'కుభేర' చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ముంబై గ్యాంగ్ స్టర్ బ్యాక్ డ్రాప్ లో రూపొందుతున్న చిత్రమిది. హీరో ధనుష్ అయినా ఈడీ ఆఫీసర్ పాత్రలో నాగార్జున రోల్ సైతం అంతే పవర్ ఫుల్ గా ఉంటుంది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. చిత్రీకరణ ముగింపు దశకు చేరుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు శర వేగంగా జరుగుతున్నాయి. అన్ని పనులు పూర్తి చేసి జూన్ 20న రిలీజ్ చేయాలని సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఈ చిత్రం రిలీజ్ కు ముందే ఇదే త్రయం మధ్య మరో చిత్రం లాక్ అయినట్లు సమాచారం. ధనుష్, నాగార్జునలతో శేఖర్ కమ్ముల్లా మరో చిత్రం తెరకెక్కించాలని ప్లాన్ చేసారట. దీనిలో బాగంగా ఇటీవలే ముగ్గురి మధ్య స్టోరీ డిస్కషన్ కూడా జరిగిందని వినిపిస్తోంది. లైన్ నచ్చడండో మళ్లీ కలిసి పనిచేయడానికి నాగ్, ధనుష్ కూడా ఒకే చెప్పారట. దీంతో ఇప్పుడీ త్రయం సంచలనంగా మారింది. కుభేర రిలీజ్ కి ముందే ఒప్పందం కుదిరిందంటే కుభేర పై ముగ్గురు ఎంత కాన్ఫిడెంట్ గా ఉన్నారు? ఇంత వరకూ ఆయన స్టార్ హీరోలతో సినిమాలే చేయలేదు. చాలా వరకూ కొత్త వాళ్లే కనిపిస్తారు. 'కుభేర' కోసం ధనుష్-నాగార్జునలను ఏకం చేసారు.

తనదైన అందం ఆకర్షణతో షామా శికందర్ యువతరంలో భారీ ఫాలోయింగ్ ని తెచ్చుకుంది. బుల్లితెర నటిగా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా ఫ్యాన్స్ తనను వోన్ చేసుకున్నారు. తనకు ఉన్న ఫాలోయింగ్‌కి తగ్గట్టే ఇన్ స్టా వేదికపై నిరంతర ట్రీట్ కి ప్లాన్ చేస్తోంది ఈ బ్యూటీ. షామా తాజాగా షేర్ చేసిన ఓ ఫోటోషూట్‌లో వైట్ బాడీ కాన్ డ్రెస్‌లో మతులు చెడగొట్టింది. శరీరాన్ని అందంగా అల్లుకుపోయన ఈ గౌన్ .. షామా ఎక్స్ ప్రెషన్స్ గురించి బోయ్స్ విస్తృతంగా చర్చిస్తున్నారు. ఈ అందమైన ఫోటోగ్రాఫ్ కి అద్భుతమైన క్యాప్షన్ ని షామా ఇచ్చింది. ఈ ఫోటోగ్రాఫ్ నలుపు, తెలుపు కావచ్చు, కానీ నన్ను నమ్మండి, ఆ క్షణం రంగులతో నిండి ఉంది...


# మత్తు కళ్లతో షామా

అని ఫోటోకి క్యాప్షన్ రాసింది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారింది. ంళిషామా కెరీర్ మ్యాటర్ కి వస్తే.. కేవలం 17 సంవత్సరాల వయసులో గ్లామర్ ప్రపంచంలోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ. తనదైన అందం నటప్రతిభతో పెద్ద నిర్మాతలు దర్శకుల దృష్టిని ఆకర్షించింది. 1999లో ఆమిర్ ఖాన్- మనీషా కొయిరాలాతో కలిసి మన్ చిత్రంలో నటించే అవకాశం లభించింది. ఇంద్రకుమార్ ఈ చిత్రానికి దర్శకుడు. ఇది షామాకు ఒక గొప్ప అరుదైన క్షణం.



## మూవీ రివ్యూ

# గుడ్-బ్యాడ్-అగ్లీ



నటీనటులు: అజిత్ కుమార్-త్రిష-అర్జున్ దాస్-జాకీ ష్రాఫ్-సునీల్-ప్రియ ప్రకాష్ వారియర్- ప్రసన్న-ప్రభు-యోగిబాబు-రెడిన్ కింగ్స్ లీ-కార్తికేయ దేవ్ తదితరులు
సంగీతం: జి.వి.ప్రకాష్ కుమార్ ఛాయాగ్రహణం: అభినందన్ రామానుజం నిర్మాతలు: యలమంచిలి రవిశంకర్-నవీన్ ఎర్నేని రచన-దర్శకత్వం: ఆధిక్ రవిచంద్రన్

**కథ:** ఏకే పూర్వాశ్రమంలో పెద్ద ఇంటర్నేషనల్ డాన్. ఐతే కుటుంబం కోసం మాఫియా కార్యకలాపాలన్నీ పక్కన పెట్టి సాధారణ జీవితం గడపాలని నిర్ణయించుకున్న అతను.. తన నేరాలు ఒప్పుకుని జైలుకు వెళ్తాడు. జైలు నుంచి విడుదలై కుటుంబంతో సంతోషంగా గడపాలి అనుకున్న సమయంలోనే తన కొడుకు కిడ్నాప్ అవుతాడు. తర్వాత అతను డ్రగ్స్ వినియోగంతో పాటు హత్యా నేరం కేసులో అరెస్ట్ అవుతాడు. తన కొడుకును కుట్రపూరితంగా ఇందులో ఇరికించారని తెలియడంతో ఏకేలోని పాత మనిషి బయటికి వస్తాడు. ఈ కుట్ర చేసింది ఎవరో తనదైన శైలిలో విచారించడం మొదలుపెడతాడు. దీనికంతటికీ జానీ (అర్జున్) దాస్ కారణమని తెలుస్తుంది. ఇంతకీ ఏకే కొడుకుని జానీ ఎందుకు టార్గెట్ చేశాడు.. తన గతమేంటి.. అతడికి ఏకే కుటుంబానికి సంబంధమేంటి.. ఏకే అతడికి ఎలా బుద్ధి చెప్పాడు అన్నది మిగతా కథ.

**కథనం-విశ్లేషణ:** హీరో పేరు విన్నా.. అతడి ఫొటో చూసినా.. వామ్మో ఇతనా అంటూ కనిపించే ప్రతి క్యారెక్టర్ భయంతో వణికిపోవడం.. తన గురించి ఎలివేషన్లు ఇవ్వడం.. బ్యాగ్రౌండ్ స్కోర్ మోత మోగిపోవడం.. కెమెరా షేకైపోవడం.. 'కేజీఎఫ్' సినిమా పుణ్యమా అని బాగా ఊపందుకున్న ట్రెండ్ ఇది. ఐతే ఊరికే మిగతా పాత్రలతో ఇలా హైప్ ఇచ్చి ఊరుకుంటే సరిపోదు.. ఆ పాత్ర నేపథ్యం చూశాక ఆ బిల్డప్ కరెక్టే అనిపించాలి. అది జరిగినప్పుడే ఎలివేషన్లు వర్కవుట్ అవుతాయి. కానీ గత కొన్నేళ్లలో వచ్చిన చాలా సినిమాల్లో హీరో పాత్రల్ని.. వాటికిచ్చే బిల్డప్ ను చూస్తే 'కేజీఎఫ్'ను చూసి వాత పెట్టుకున్నట్లే అనిపిస్తుంది తప్ప ఎలివేషన్ పెద్దగా పండిన దాఖలాలు కనిపించవు. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కూడా ఈ కోవకే చెందుతుంది. సినిమాలో ఓ గంట పాటు గురంచి పెద్ద తోపు.. తురుం ఖాన్ అంటూ చుట్టూ ఉండే క్యారెక్టర్లు బిల్డప్పులివ్వడానికే సరిపోతుంది. తీరా అతనేం చేశాడో చూద్దాం అని ఒక లుక్కేస్తే.. ఏఐ సాయంతో కీను రీవ్స్ లాంటి ఇంటర్నేషనల్ స్టార్ల పక్కన అజిత్ ను నిలబెట్టేసి.. యానిమేషన్ రూపంలో అతడి విన్యాసాల్ని చూపించి సరిపెట్టేశాడు దర్శకుడు. దీనికి తోడు పదే పదే అజిత్ స్లోమోషన్లో నడిపించడం.. తన పాత సినిమాల్లోని రెఫరెన్సులు పెట్టడం.. సినిమా అంతా ఇదే వరస. ఇలాంటివి చూసి తమిళనాట అజిత్ ఫ్యాన్స్ ఊగిపోతారేమో కానీ.. మన ప్రేక్షకులకైతే ఇది ఎంతమాత్రం కిక్కు ఇవ్వదు. తెలుగు ప్రేక్షకుల కోణంలో చూస్తే మాత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఒక తలపోటు వ్యవహారంలాగే అనిపిస్తుంది. హీరో పూర్వాశ్రమంలో పెద్ద డాన్.. వర్తమానంలో సామాన్య జీవితం గడుపుతుంటాడు. తన కుటుంబ సభ్యుల్లో ఒకరికి సమస్య తలెత్తితే అతడి పాత అవతారం బయటికి వస్తుంది.. 'బాషా'తో మొదలుపెడితే గత మూడు దశాబ్దాల్లో ఈ లైన్లో ఎన్ని వందల సినిమాలు వచ్చాయో లెక్కే లేదు. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కూడా అదే కోవలోని చిత్రమే. ఐతే గత కొన్నేళ్లలో అజిత్ మాస్ ఇమేజ్ పక్కన పెట్టి కొన్ని ప్రయోగాత్మక చిత్రాలు చేసి దెబ్బ తిన్న నేపథ్యంలో.. ఈసారి కథ.. కొత్తదనం.. కాకరకాయ అని ఎక్కువ ఆలోచించకుండా కేవలం ఫ్యాన్స్ కు మాస్ ట్రీట్ ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లున్నాడు దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్. హీరో ఇంట్రో దగ్గర్నుంచి దగ్గర్నుంచి ఒకటే బిల్డప్ సీన్లతో సినిమాను నింపేశాడు. వీటికి తోడు అజిత్ పాత చిత్రాల రెఫరెన్సులు సినిమాలో బోలెడు కనిపిస్తాయి. అజిత్-త్రిష జంటగా నటించిన 'మన్కాతా' సినిమాలో హీరో.. హీరోయిన్ తండ్రిని కార్లోంచి తోసేస్తాడు. దాన్ని గుర్తు చేస్తూ త్రిష డైలాగ్ చెప్పడం మొదలు.. సిమ్రన్‌ను తీసుకొచ్చి 'వాలి' సినిమా మ్యూజిక్ బిట్స్ వేయడం వరకు అజిత్ సినిమాల రెఫరెన్సులకైతే లెక్కే లేదు. ఓవైపు విపరీతమైన ఎలివేషన్లు.. ఇంకోవైపు ఇలాంటి రెఫరెన్సులతో అజిత్‌ను ఫ్యాన్స్ ఎలా చూడాలనుకుంటు న్నారో అలా చూపించి వారికి గూస్ బంప్స్ ఇవ్వడం బాగానే ఉంది కానీ.. కథ పరంగా మాత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఏమంత ఎగ్జైట్మెంట్ కలిగించదు. ఓవరాల్ గా అంత మంచి ఫీలింగ్ ఇవ్వకపోయినా.. కొన్ని ఎపిసోడ్ల వరకు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఓకే చేస్తుంది. ముఖ్యంగా విలన్ డెన్లోకి హీరో ఎంట్రీ ఇచ్చి అక్కడ విధ్వంసం సృష్టించే ఎపిసోడ్ ప్రథమార్ధానికి హైలైట్ గా నిలుస్తుంది. ద్వితీయార్ధంలో కూడా యాక్షన్ సీక్వెన్సులన్నీ బాగానే తీశారు. కానీ సినిమాను ముందుకు తీసుకెళ్లే బేసిక్ ఎమోషన్ అయితే ఇందులో ఏమీ లేదు. హీరో ఇంటర్నేషనల్ మాఫియా డాన్ గా ఎదిగే క్రమం కానీ.. ఫ్యామిలీకి సంబంధించిన ఎమోషనల్ యాంగిల్ కానీ.. బలంగా లేవు. అంతా పైపై వ్యవహారంలా అనిపిస్తుంది. ఎలివేషన్లు శ్రుతి మించడం.. ప్రతి సన్నివేశంలో విపరీతమైన హడావుడి కనిపించడం వల్ల ఒక దశ దాటాక 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చికాకు పెడుతుంది. చివరి అరగంటలో అయితే ఈ హడావుడి మరీ ఎక్కువైపోయి ముగింపు సమయానికి తలపోటు తప్పదు. ఎమోషన్ సంగతి పట్టించుకోకుండా కేవలం ఎలివేషన్లు చూసి ఊగిపోవాలనుకుంటే 'గుడ్ బ్యాడ్ అగ్లీ'పై ఓ లుక్కేయొచ్చు. అంతకుమించి ఆశిస్తే మాత్రం తీవ్ర నిరాశ తప్పదు.

**నటీనటులు :** కొన్నేళ్లుగా అభిమానులను మెప్పించే సినిమా చేయలేకపోతున్న అజిత్.. ఈసారి వారిని మెప్పించడమే లక్ష్యంగా.. తనకు వీరాభిమాని అయిన దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ ఏం చెబితే అది చేసినట్లున్నాడు. తన లుక్ గత చిత్రాలతో పోలిస్తే చాలా బాగుంది. యంగ్ లుక్ సహా వేరియేషన్లు బాగానే చూపించాడు. ఎలివేషన్ సీన్లలో అజిత్ స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంది. అభిమానులనే కాక మాస్ ను మెప్పించేలా అతను కనిపించాడు. త్రిష పాత్ర.. తన నటన సోసోగా అనిపిస్తాయి. తన మీద వయసు ప్రభావం పడుతున్న సంగతి ఈ చిత్రంలో స్పష్టంగా కనిపించింది. పోలీసాఫీసర్ పాత్రలో త్రిష కన్విన్సింగ్ గా అనిపించలేదు. విలన్ పాత్రలో అర్జున్ దాస్ అదరగొట్టాడు. అజిత్ కొడుకు పాత్రలో 'సలార్' ఫేమ్ కార్తికేయ దేవ్ ఓకే అనిపించాడు. జాకీష్రాఫ్ ఊరికే అరవడం తప్ప చేసిందేమీ లేదు. సునీల్ కొంచెం ముఖ్య పాత్రే చేశాడు కానీ.. దాని ఇంపాక్ట్ తక్కువే. ప్రియ ప్రకాష్ వారియర్ తన గ్లామర్ తో ఆకట్టుకుంది. ప్రసన్న.. రెడిన్ కింగ్స్ లీ సహాయ పాత్రల్లో పర్వాలేదు.

**సాంకేతిక వర్గం :** జి.వి.ప్రకాష్ కుమార్ సినిమాకు తగ్గట్లే మాస్ మసాలా మ్యూజిక్ ఇచ్చాడు. నేపథ్య సంగీతం మంచి ఊపుతో సాగుతుంది. ఎలివేషన్.. యాక్షన్ సీన్లలో స్కోర్ ఆకట్టుకుంటుంది. కానీ పాటలు మాత్రం గుర్తుంచుకునేలా లేవు. అభినందన్ రామానుజం ఛాయాగ్రహణం బాగుంది. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. మైత్రీ వాళు ఏమాత్రం రాజీ పడకుండా ఖర్చు పెట్టారు. భారీ ఫారిన్ లొకేషన్లలో రిచ్ గా సినిమా తీశారు. రచయిత-దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ నుంచి 'మార్క్ ఆంటోనీ' తర్వాత ఆశించే మ్యాజిక్ ఇందులో లేదు. అతను అజిత్ ను అభిమానులు మెచ్చేలా చూపించడం మీదే దృష్టిపెట్టాడు. అజిత్ పాత చిత్రాల రెఫరెన్సుల మీద పెట్టిన శ్రద్ధ.. కొంచెం కథాకథనాల మీద కూడా పెడితే బాగుండేది.

చివరగా: గుడ్ బ్యాడ్ అగ్లీ.. ఎలివేషన్లే తప్ప ఎమోషన్ లేదు రేటింగ్- 2.25/5

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
విద్యా వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com